RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 192 మేడ్చల్ మల్కాజ్‌గిరి 3 ఆగస్టు 2024 శనివారం పేజీలు : 4

## ఉత్తరాది అతలాకుతలం

సిమ్లా : ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్ లో క్లౌడ్ బర్స్టతో కులు, పధార్, మండి, సిమ్లా జిల్లాలను వరద ముంచెత్తింది. 45 మంది గల్లంతవగా.. వీరిలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇళ్లు, బ్రిడ్జిలు, రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. శ్రీఖండ్ మహాదేవ్ సమీపంలో బుధవారం రాత్రి క్లౌడ్ బర్స్టతో సర్పారా, గాన్వీ, కుర్బన్ నల్లాల్లో మెరుపు వరదలు సంభవించాయి. పార్వతి నదిపై మలానా డ్యామ్ కొట్టుకుపోయి దిగువ ప్రాంతాలను నీరు ముంచెత్తింది. శిమ్లా జిల్లా రాంపూర్‌లోని సమేజ్‌ఖడ్‌లో 30 మంది కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు మృతిచెందారు. మండి జిల్లా తెరాంగ్ సమీపంలోని రాజ్‌బన్ గ్రామం వద్ద మరో క్లౌడ్ బరస్ట్ జరిగింది. ఏడుగురు గల్లంతవగా ముగ్గురు ప్రాణాలు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు.

# తెలంగాణ ఉద్యమంలో టీచర్లది క్రియాశీలక పాత్ర

## ప్రభుత్వ బడుల్లోనే చదువుకుని నేను ఆ స్థాయికి వచ్చా

## 30 వేల మంది ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ప్రభుత్వ బడుల్లోనే చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని అన్నారు. తెలంగాణ భవిష్యత్ ఎక్కడుందని ఈ క్షణం తనను అడిగితే వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియంలో ఉందని చెబుతానని ఉద్ఘాటించారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నాడు 30 వేల మంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థులు ఉన్నారని... తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయుల చేతుల్లో పెట్టారని వివరించారు.
రాష్ట్రం వస్తే విద్యా విధానం బాగుపడుతుందనుకున్నాం.. ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుందనుకున్నామని చెప్పారు. కోదండరాం, హరగోపాల్, చుక్కా రామయ్య లాంటి వాళ్లకు గొప్ప గౌరవం దక్కుతుందని అనుకున్నామని కానీ తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఏం జరిగిందో చూశామని అన్నారు. గత పాలకులు ఉపాధ్యాయులను ఏ విధంగా అవమానించారో చూశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**బడ్జెట్‌లో 7.3 శాతం కేటాయించాం..** " తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించాలని భావించాం. కానీ హామీల అమలు దృష్ట్యా 7.3శాతం అంటే రూ.21వేల కోట్లకు పైగా కేటాయించాం. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 30వేల పాఠశాలల్లో.. 26లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారు..10వేల ప్రైవేట్ పాఠశాలల్లో.. 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.ప్రైవేట్ పాఠశాలల్లో మీకంటే గొప్ప టీచర్లున్నారా? మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు.
తెలంగాణలో ఉద్యోగుల పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కంటే దారుణంగా ఉంది.. ఇది కఠోర నిజం. టీచర్లు తేనెతుట్టె లాంటి వా ళ్లు.. హాని చేయాలని చూస్తే తీనెటీగల్లా ఎదురుదాడికి దిగుతారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతీ నెలా 1వ తేదీనే జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నాం. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల అంశాన్ని పరిష్కరించాం. మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గాయి..** "తెలంగాణ భవిష్యత్ మా చేతుల్లో కాదు.. మీ చేతుల్లో ఉందని చెప్పేందుకే ఈ సమావేశం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నేను ఈ స్థాయికి చేరా. అలాంటి ప్రభుత్వ టీచర్లను కలుసుకునేందుకే ఈ ఆత్మీయ సమావేశం. టీచర్లంతా 90శాతం పైగా నిబద్ధతతో పనిచేయాలి.. విద్యార్థులకు విద్యనందించాలి. గత ఏడాదికంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2లక్షలకు పైగా విద్యార్థుల అడ్మిషన్లు తగ్గాయి. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవమని భావించేలా పాఠశాలలను తీర్చిదిద్దాలి. ప్రభుత్వం వైపు నుంచి మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**కార్యదీక్షతో పనిచేయాలి..** "అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మహిళలకు బాధ్యత అప్పగించాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించాం. తెలంగాణ బలపడాలి అంటే మనందరం కార్యదీక్షతో పనిచేయాలి. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాల్లో మినీ స్టేడియంల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగం పెరుగుతోంది.

అందుకే ముచ్చర్లలో 50 ఎకరాల్లో రూ.150 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం. స్కిల్ యూనివర్సిటీలో యువకులకు నైపుణ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తాం. మీరు నేర్పే విద్యనే రేపటి తెలంగాణ భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే మీ లక్ష్యం కావాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.




## తెలంగాణలో జాబ్ క్యాలెండర్ విడుదల

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏయే ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేయాలనే విషయాలను క్యాలెండర్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసే నెల, పరీక్షలు ఎప్పుడు నిర్వహించాలనే వివరాలతో పాటు నియామకాలు నిర్వహించే ఏజెన్సీ, ఉద్యోగానికి కావాల్సిన అర్హతల గురించి అందులో పొందుపర్చారు. ఈ మేరకు జాబ్ క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 పరీక్షలు అక్టోబరులో, గ్రూప్-2ను డిసెంబరులో, గ్రూప్-3 నవంబరులో నిర్వహించనున్నారు. వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్ నియామకాల కోసం సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల... నవంబర్‌లో పరీక్షలు. ట్రాన్స్‌లోని వివిధ ఇంజనీరింగ్ ఉద్యోగాల కోసం అక్టోబర్‌లో నోటిఫికేషన్.. వచ్చే ఏడాది జనవరిలో నియామక పరీక్షలు. నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి వచ్చే ఏడాది జనవరిలో పరీక్షలు. వివిధ శాఖల్లో గెజిటెడ్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల.. ఏప్రిల్‌లో పరీక్షలు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల .. ఏప్రిల్‌లో పరీక్షలు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ .. మేలో పరీక్షలు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వచ్చే ఏడాది జూలైలో నిర్వహించనున్నారు. ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తారు. డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టులకు వచ్చే ఏడాది జూన్‌లో నోటిఫికేషన్..సెప్టెంబర్‌లో పరీక్షలు. వచ్చే ఏడాది మేలో మరోసారి గ్రూపు2 నోటిఫికేషన్.. అక్టోబర్‌లో పరీక్షలు. వచ్చే ఏడాది జులైలో గ్రూప్-3 నోటిఫికేషన్ నవంబర్‌లో పరీక్షలు. సింగరేణిలో పలు ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జులైలో నోటిఫికేషన్.. నవంబర్‌లో పరీక్షలు

# మమ్మల్ని వేధిస్తున్నారు.. సభలో కేటీఆర్..!



ప్రతిపక్ష సభ్యులను ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. తమ పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కేసులు పెడుతున్నారన్నారు. పోస్టులు డిలీట్ చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని కేటీఆర్ శాసనసభలో తెలిపారు. రాష్ట్రంలో శాంతి, భద్రతలను కాపాడటంలో రాజీపడబోమని, ఎవరిపై వేధింపులు ఉండబోవని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పగా.. దీనిపై కేటీఆర్ స్పందించారు. తాము లేవనెత్తిన కొన్ని అంశాలపై మంత్రి స్పందించలేదన్నారు. ఐపీసీ స్థానంలో తీసుకొచ్చిన కొత్త న్యాయచట్టాలపై కర్ణాటక, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలు కొన్ని సవరణలు తీసుకొచ్చాయని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎలాంటి సవరణలు తీసుకురావడం లేదన్నారు. కేంద్రం తెచ్చిన చట్టాలపై తెలంగాణ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలన్నారు. సవరణలు చేసే ఉద్దేశం ఉంటే ఎప్పుడు ఆ బిల్లు తీసుకొస్తారో సభకు తెలియజేయాలని కేటీఆర్ కోరారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు, చర్యలకు వ్యతిరేకంగా నిరహారదీక్షలు చేయడం కూడా కొత్త చట్టాల ప్రకారం నేరమని.. అలాంటి చట్టాల్లో సవరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

**ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్..** తెలంగాణలో పోలీసుల వైఖరిని కేటీఆర్ తప్పుబట్టారు. వివిధ ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలపై అనధికార ఒత్తిడి, బలప్రయోగం సరికాదన్నారు. చట్టాలను ప్రభుత్వం దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. ఇటీవల పౌరహక్కుల సంఘం నాయకులు హైదరాబాద్‌లోని ఓ హాలులో సమావేశం పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వలేదని.. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని కేటీఆర్ సూచించారు. అసెంబ్లీ హాల్‌లో ఫోటోలు, వీడియోలు తీయడంపై కేటీఆర్ స్పందిస్తూ.. పార్లమెంట్‌లో గతంలో కాంగ్రెస్ ఎంపీలు ఫోటోలు, వీడియోలు తీసిఉండొచ్చన్నారు. ఈ వ్యాఖ్యలను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఖండించారు. పార్లమెంట్, అసెంబ్లీలో ఫోటోలు, వీడియోలు తీయడం పూర్తిగా నిషేధమని, అలాంటి చర్యలకు పాల్పడితే స్పీకర్‌కు చర్యలు తీసుకునే అధికారం ఉందన్నారు. తాను మాట్లాడేటప్పుడు మంత్రులు రన్నింగ్ కామెంట్రీ చేయడం సరికాదని కేటీఆర్ పేర్కొన్నారు. ఎవరైనా ఫోటోలు, మార్ఫింగ్ చేస్తే చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో అధికారపక్షం మరింత బాధ్యతతో వ్యవహరించాల్సి ఉంటుందన్నారు.

**కేటీఆర్ వ్యాఖ్యలపై స్పీకర్..** కేటీఆర్ వ్యాఖ్యలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పందించారు. రెండు రోజుల క్రితం అసెంబ్లీ హాల్‌లో తీసిన వీడియో పంపిస్తానని.. ఆది సహేతుకమైన చర్య కాదన్నారు. అలా వీడియో మార్ఫింగ్ చేసి ప్రచారం చేయడం దుర్మార్గపు చర్యగా, దుశ్చర్యగా స్పీకర్ పేర్కొన్నారు. సభకు సంబంధించిన అంశాలను ఇలా మార్ఫింగ్ చేయడం సరికాదన్నారు. ఆ వీడియో సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, వీడియో చూసిన తర్వాత మీరు మాట్లాడాలంటూ కేటీఆర్‌కు స్పీకర్ సూచించారు.

# తెలంగాణలో స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తాం...



## అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తాం : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : తెలంగాణలో స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామని, కందుకూరు మండల పరిధిలోని బేగరికంచలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. పిల్లలను పుస్తకాలకు పరిమితం చేసి క్రీడలకు దూరం చేస్తున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మా ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి స్పోర్ట్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆలోచన చేస్తూ వివిధ సందర్భాల్లో నేను ప్రస్తావించాను. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో గచ్చిబౌలి స్టేడియంలో వివిధ రకాల క్రీడలు నిర్వహించాం. వివిధ కారణాల చేత గేమ్స్ నిర్లక్ష్యానికి గురయ్యాయి. పుల్లెల గోపీచంద్ అకాడమీకి ల్యాండ్ ఇచ్చాం. ఆ అకాడమీ నుంచి చాలా మంది క్రీడాకరులు తయారయ్యారు. ప్రయివేటు అకాడమీలు కాకుండా ప్రభుత్వం తరపున శిక్షణ ఇస్తే అద్భుతంగా రాణించడానికి అవకాశం ఉంటుంది.. అందుకే ప్రత్యేకంగా ఈ బడ్జెట్‌లో స్పోర్ట్స్ కోసం రూ. 361 కోట్లు కేటాయించాం అని రేవంత్ రెడ్డి తెలిపారు.

**పిల్లలను క్రీడలకు దూరం చేస్తున్నారు..** పిల్లలను పెద్ద పెద్ద చదవులు చదివించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వారిని పుస్తకాలకే పరిమితం చేసి క్రీడలకు దూరం చేస్తున్నారు. ఆటల్లో కూడా రాణిస్తే ఉద్యోగాలు వస్తాయి.. ఉపాధి దొరుకుతుంది.. ఆ కుటుంబానికి గౌరవం కూడా లభిస్తుంది. ఈ విషయం ప్రపంచానికి తెలియజేసేందుకే నిఖత్ జరీన్‌కు, సిరాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాం. ఇండ్లు కట్టుకునేందుకు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో 600 గజాల చొప్పున స్థలం కేటాయించాం అని సీఎం పేర్కొన్నారు.

**విద్యార్హత లేకున్నా సిరాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చాం..** చదవు కంటే కూడా క్రీడల్లో రాణిస్తే తప్పకుండా ఉద్యోగ భద్రత ఉంటుంది. ఇంటర్ పాసైన సిరాజ్‌కు విద్యార్హతలో మినహాయింపు ఇచ్చి ఉద్యోగం ఇచ్చాం. తెలంగాణ రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తాం. వివిధ రాష్ట్రాల్లో స్టడీ చేసి సమాచారం సేకరించాం. హర్యానా రాష్ట్రంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నారు. కాబట్టి హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను అనుసరించాలని నిర్ణయించాం. వచ్చే సమావేశాల్లో స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తాం అని రేవంత్ రెడ్డి ప్రకటించారు.

**ప్రతి మండల కేంద్రంలో ఒక మినీ స్పోర్ట్స్ స్టేడియం :** ప్రతి మండల కేంద్రంలో ఒక మినీ స్పోర్ట్స్ స్టేడియంను నిర్మిస్తాం. రాష్ట్రంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐతో మాట్లాడుతున్నాం.. ప్రాథమిక చర్యలు పూర్తయ్యాయి. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రాంతానికి న్యాక్‌ను షిఫ్ట్ చేస్తాం. బేగరికంచెలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియంను నిర్మించడానికి భూమి కేటాయిస్తాం. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐ వారు ముందుకు వచ్చారు.

ఈ స్పోర్ట్స్ విషయంలో నిధుల కేటాయింపుతో పాటు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. ఈ రాష్ట్రంలో యువతను వ్యసనాల నుంచి బయటకు తీసుకురావలంటే స్పోర్ట్స్‌ను ప్రోత్సహించాలి. స్పోర్ట్స్ పాలసీకి సంబంధించి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తాం. కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి, సరూర్ నగర్, ఎల్‌బీ స్టేడియంలు రాజకీయ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ప్రపంచంలో మన పిల్లలు పతకాలు సాధించే విధంగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# సంపాదకీయం

## బీహార్ లో పీకే పార్టీ... ఎవరికి ఎసరు పెట్టబోతోంది ?

బీహార్ రాజకీయాలు ఎపుడూ చిత్రంగా ఉంటాయి. అవి కులాల చుట్టూ తిరుగుతాయి. దేశంలో వెనుకబడిన రాష్ట్రాలలో బీహార్ ఒకటిగా ఉంది. బీహార్ ను ఎంతోమంది రాజకీయ నేతలు పాలించినా కూడా అభివృద్ధి అయితే ఆశించిన స్థాయిలో లేదు. మరీ ముఖ్యంగా గత మూడున్నర దశాబ్దాలుగా చూస్తే బీహార్ లో అయితే లాలూ కుటుంబం లేకపోతే నితీష్ కుమార్ అన్నట్లుగానే పాలిటిక్స్ ఉంది. 1990 దశకం నుంచి 2005 దాకా లాలూ ఆయన సతీమణి రబ్రీదేవి బీహార్ ని సీఎంలుగా పాలిస్తే అక్కడ నుంచి నితీష్ కుమార్ అందుకున్నారు. ఆయన సుదీర్ఘ కాలం సీఎం గా ఉన్న ఘనతను సాధించారు. ఇక లాలూ ప్రసాద్ నాయకత్వంలోని ఆర్జేడీ అలాగే నితీష్ కుమార్ నాయకత్వంలోని జేడీయూలు రెండూ బలంగా ఉంటే బీజేపీ జేడీయూతో పొత్తు పెట్టుకుని ఉప ముఖ్యమంత్రి దాకానే వచ్చింది. బీహార్ సీఎం కల అన్నది ఆ పార్టీకి సాకారం కావడం లేదు. 2025 నవంబర్ లో బీహార్ లో శాసనసభకు ఎన్నికలు జరగనున్న వేళ 13 నెలల ముందు కొత్త పార్టీ రాబోతోంది. దానిని స్థాపిస్తున్న వారు రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్. ఆయన జన్ సురాజ్ పేరిట ప్రారంభించిన సామాజిక సంస్థనే రాజకీయ పార్టీగా మార్పు చేస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున ఆయన పార్టీ ప్రారంభం కాబోతోంది. పీకే ఈ మేరకు ఒక ప్రకటన కూడా చేశారు. దాంతో బీహార్ లో రాజకీయంగా చర్చ సాగుతోంది. పీకే పార్టీ వల్ల ఎవరికి ముప్పు వాటిల్లుతుందన్న చర్చ సాగుతోంది. ప్రశాంత్ కిశోర్ పార్టీ ప్రకటనతో ఆర్జేడీ విరుచుకుపడుతోంది. ఆయన అగ్ర వర్ణాలకు చెందిన వారు అని చెబుతోంది. ప్రశాంత్ కిశోర్ పాండే అని సంభోదిస్తూ ఆయన వల్ల బీసీలు వెనకబడిన వర్గాలకు ఏమి మేలు జరుగుతుందని ప్రశ్నిస్తోంది. మరో వైపు కొన్నాళ్ళ పాటు నితీష్ కుమార్ తో జట్టు కట్టి జేడీయూ జాతీయ స్థాయి ఉపాధ్యక్ష పదవిని నిర్వహించిన నేపధ్యం ఉన్నందువల్ల ప్రశాంత్ కిశోర్ పార్టీ పెడితే తమకు దెబ్బ అవుతుందా అన్న చర్చలో అధికార జేడీయూ ఉంది. కొత్త పార్టీ వస్తే అధికార పార్టీకి కూడా ఇబ్బందిగా ఉంటుంది అని అంటారు. అదే విధంగా అగ్ర వర్ణాల ఓట్లను బీహార్ లో ఇప్పటిదాకా పొందుతూ వస్తున్న బీజేపీ కూడా పీకే పార్టీని గమనిస్తోంది. ఆయన కూడా అగ్రవర్ణాలకు చెందిన వారు కావడంతో తమ ఓటు బ్యాంక్ కి గండి పడుతుందా అన్న చర్చలో ఉంది. మొత్తం మీద చూస్తే పీకే పార్టీ మీద చర్చ అయితే సాగుతోంది. బీహార్ లో రెండే పార్టీలు ఇద్దరు ముగ్గురు నాయకుల మధ్యనే తిరుగుతున్న రాజకీయాన్ని మారుస్తాను అని పీకే అంటున్నారు. ఆయన రెండేళ్ళ పాటు పాదయాత్ర చేసి తనకంటూ ప్రతీ గ్రామంలో క్యాడర్ ని తయారు చేసుకున్నారు. బీహార్ లో రాజకీయ శూన్యత ఉందని నమ్ముతున్న పీకే తన రాజకీయ వ్యూహాలు తనను బీహార్ సీఎం గా చేస్తాయా లేదా అన్నది చూడాల్సి ఉంది.

## సబ్ రిజిస్ట్రారు కార్యాలయం తాహసిల్దారు కార్యాలయం వద్దనే ఏర్పాటు చేయాలి



శామీర్ పేట, (గరుడ వార్త) : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కూడా తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి డీ జీ సాయిలు గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం అలియాబాద్ చౌరస్తాలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు గౌడ్ మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుందని, ప్రభుత్వ కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుందని తెలిపారు. గత 1996 నుంచి ప్రస్తుతం వరకు ప్రైవేట్ బిల్డింగ్ లో అద్దెకు తీసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం స్థానిక శాసనసభ్యులు, మాజీమంత్రి మల్లారెడ్డి హైవే పక్కన ఉన్న బిల్డింగ్ దర్గా చౌరస్తాలో కి మార్చాలని ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. అట్టి బిల్డింగ్ లోనికి మారిస్తే ఖాళీ స్థలం లేనందున పార్కింగ్ సమస్య వస్తుందన్నారు. పైగా దర్గా చౌరస్తా వద్ద రోడ్డు వైయిడింగ్, అక్కడ ఇప్పటికే చాలా యాక్సిడెంట్లు, ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఒక ప్రైవేటు వ్యక్తి భూస్వామి తన స్వార్ధ ప్రయోజనాల కోసం అతనికి కిరాయి అద్దె రూపాయలు వస్తాయని మంత్రి మల్లారెడ్డి ని తప్పుతోవ పట్టించి, అక్కడికి మార్చాలని ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. తమరు ఇట్టి విషయంలో గతంలో అభ్యంతరాలు ప్రజలు తెలియజేయడం జరిగినదని, తమరు దయచేసి పరిశీలించి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ప్రక్కన ఉన్న స్నేహ సంఘం బిల్డింగ్లోనికి మార్చాలని డిమాండ్ చేశారు. ఇక్కడ పార్కింగ్ సమస్య ఉండదని, పైగా ప్రభుత్వానికి ప్రస్తుతం ఉన్న దుకాణ సముదాయం అద్దె ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని తెలియజేశారు. లేనిపక్షంలో శామీర్ పేట గ్రామపంచాయతీ బిల్డింగ్ నూతనంగా నిర్మాణం చేస్తున్న భవనంలోకి మార్చాలని, ఆ భవనంలోకి మార్చితే గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఎలాంటి పార్కింగ్ సమస్యలు ఉండవని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సీతారాములు గౌడ్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నిమ్మల నరసింహ, శామీర్ పేట మండల సిపిఐ కార్యదర్శి డిజి నరేంద్ర ప్రసాద్, వెంకటేష్ లు పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం, పచ్చదనం పెంచేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలి



శామీర్ పేట, (గరుడ వార్త) : గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు నూతన కమిటీలను ఏర్పాటు చేసి స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని బాధ్యతగా చేపట్టి విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సైదులు తెలిపారు. శుక్రవారం శామీర్ పేట మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి సైదులు మండల, గ్రామాధికారులతో స్వచ్ఛదనం, పచ్చదనం పై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రత్యేకా ధికారి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో పంచాయతీ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లు, మహిళా విఓ లతో నూతనంగా గ్రామ కమిటీలను విధిగా ఏర్పాటు చేసి స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని చురుక్కుగా చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో సంబందిత పంచాయ తీ స్పెషలాఫీసర్ నిర్లక్ష్యం వహించకుండా స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని ప్రత్యేకాధికారి సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం లో గ్రామాల్లో అధికారులు నిర్లక్ష్యం చేయకుండ ప్రతి రోజు పారిశుద్య కార్యక్రమాలను చేపడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మమతబాయి , ఎంపీఓ వినూత్న, పంచాయతీ కార్యదర్శులు, వివోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పంట బీమా.. రైతన్న ధీమా



కరీంనగర్ : భూమిని దుక్కి దున్నింది మొదలు విత్తనం నాటి పంట చేతికొచ్చే వరకు ప్రకృతి సహకరించాలని రైతు రోజు దేవుడిని వేడుకుంటాడు. కానీ ప్రకృతి ప్రకోపానికి పంటలు కొన్ని మొదట్లోనే.. మరికొన్ని చేతికి వచ్చే దశలో నాశనమవుతాయి. అన్నదాతల ఆరుగాల కష్టం బూడిదలో పోసిన పన్నీరుగానే మారుతుంది. కనీసం పెట్టుబడి రాక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాలు దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న రైతుల పంటలకు బీమాను అందజేస్తున్నాయి.

**రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం..**

రాష్ట్ర ప్రభుత్వం వచ్చే వానాకాలం నుంచి ఉచిత పంట బీమా పథకం అమలుకు సిద్ధమైంది. అందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చేరడం, ప్రీమియం చెల్లింపు, బీమా పరిహారం తదితర వాటితోపాటు పొరుగు రాష్ట్రాల్లో పంటల బీమా పథకం అమలు తీరుపై అధ్యయనం చేస్తోంది. అమలు తీరుతెన్నులపై చర్చించడానికి ఇటీవల వ్యవసాయ అధికారులు, రైతులతో కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం సైతం నిర్వహించారు.

**రైతులపై భారం లేకుండా..**

ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 95 శాతం, మిగిలిన అయిదు శాతం ప్రీమియాన్ని రైతులు చెల్లించేవారు. పరిహారం పొందడంలో సమస్యలు, రైతులకు ఉపయోగంగా ఉండట్లేదనే కారణంతో గత రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల కిందట ఈ బీమా పథకం అమలును రాష్ట్రంలో నిలిపివేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ఈ బీమా పథకాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రైతులపై భారం పడకుండా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలనే నిర్ణయం తీసుకుంది.

**పకడ్బందీగా అమలుకు కసరత్తు**

పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోంది. ఇప్పటికే క్లస్టర్ల వారీగా వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్‌ను పరిగణనలోకి తీసుకోనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలు సందర్శించి, రైతుల ద్వారా సమాచారాన్ని సేకరించి నమోదు చేస్తూ వచ్చారు. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో నమోదుపై గొడవలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. వీటిని అధిగమించడంతోపాటు బీమా పక్కగా అమలు పర్చడానికి రైతుల నుంచి బయోమెట్రిక్, డిక్లరేషన్ తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. వానాకాలం మరికొద్ది రోజుల్లోనే ప్రారంభమవుతున్న దృష్ట్యా.. పంటల బీమా పథకం అమలు తుది రూపునకు తీవ్ర కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. పంటల సాగు అంచనాలు, ప్రీమియం తదితర వివరాల ప్రాథమిక సమాచారాన్ని రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించారు. అనంతరం తుది మార్గదర్శకాల రూపకల్పన, బీమా కంపెనీలతో ఒప్పందం, ప్రీమియం నిర్ధారణతోపాటు అందుకనుగుణంగా ప్రభుత్వం బడ్జెట్ విడుదల త్వరితగతిన చేయాల్సిన ఉంటుంది.

**సాగు విస్తీర్ణం**

అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 2.03 లక్షల మంది రైతులున్నట్లు సమాచారం. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం 3.45 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం జరుగుతుందని గుర్తించారు. వానాకాలం, యాసంగి రెండు సీజన్లలో జిల్లాలో ప్రధాన పంటగా వరి ధాన్యం పండిస్తున్నారు. తర్వాత స్థానం పత్తి, మొక్కజొన్న ఉండగా, మిగిలిన పంటలు నామమాత్రంగానే సాగు అవుతున్నాయి.

అన్నదాత ప్రయోజనాలకు ప్రాధాన్యంఅకాల వర్షాలతోపాటు పలు ప్రకృతి వైపరీత్యాలకు రైతులు తీవ్రంగా పంట నష్టపోతున్నారు. వారిని గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీమా అమలుకు శ్రీకారం చుట్టింది. రైతుల ప్రయోజనాల మేరకు తుది నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం.బి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరిన్ని సేవలు

పెద్దపల్లి : వైద్య ఆరోగ్య శాఖలో పలు పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత కొన్నాళ్లుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య విధాన పరిషత్, బోధనాసుపత్రుల్లో ఖాళీల కొరత ఆరోగ్య సేవలపై ప్రభావం చూపుతోంది. క్షేత్ర స్థాయిలో ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పార్లమెంటు ఎన్నికల కోడ్ ముగియడంతో నియామక ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించింది. ఆర్థిక శాఖ అనుమతి లభించడంతో నోటిఫికేషన్ విడుదలకు రంగం సిద్ధమవుతోంది. ఎట్టకేలకు ఖాళీల భర్తీ కానున్నండటంతో పేదలకు వైద్యం మెరుగుపడనుంది.

**ఒప్పంద పద్ధతిలో నియమించినా...**

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక, పట్టణ, విద్యా విధాన పరిషత్‌లోని దవాఖానాలతోపాటు బోధనాసుపత్రుల్లో వైద్య నిపుణులు, సిబ్బంది లేకపోవడంతో సేవలకు విఘాతం కలుగుతోంది. ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య, పల్లె, పట్టణ దవాఖానాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. కొన్ని చోట్ల ఒప్పంద పద్ధతిలో వైద్య సిబ్బంది నియమించినా ఎవరూ విధుల్లో చేరడంలేదు. సరైన వేతనం, శ్రమ, పని ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో విధుల్లో చేరకుండానే వెనక్కి వెళ్లిపోతున్నారు.

బోధనాసుపత్రుల్లో..ఉమ్మడి జిల్లాలో రామగుండం, కరీంనగర్,



జగిత్యాల, రాజన్నసిరిసిల్ల బోధనాసుపత్రుల్లో దాదాపు 32 విభాగాల ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతోపాటు పాథాలజీ, ఫార్మాకళాశాల, కమ్యూనిటీ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్ ఇలా 8 రకాల నాన్‌క్లినికల్ పోస్టులు వెక్కిరిస్తున్నాయి. బోధనాసుపత్రుల్లో ఖాళీలతో వైద్య విద్యార్థులతోపాటు రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. అత్యవసర సేవలు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లాల పరిధిలో వందకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**అందుబాటులోకి నిపుణులు..**

ప్రాథమిక, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీల భర్తీకి కసరత్తు చేస్తున్నారు. వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలతో వైద్య సేవలు మెరుగుపడనున్నాయి. బోధనాసుపత్రుల్లో వైద్య నిపుణులు అందుబాటులోకి రానున్నారు. ఇక్కడ సేవలందితే ప్రైవేటు ఆసుపత్రుల ఖర్చు తగ్గనుంది. మరో వైపు ఆశగా నిరీక్షిస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించనున్నాయి.

**ఏ జిల్లాలో ఎలా ఉందంటే..**

పెద్దపల్లి జిల్లాలో 18 ప్రాథమిక, 7 పట్టణ, 67 పల్లె, 4 బస్తీ దవాఖానాలు, 38 ఉప వైద్య కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 6 వైద్యాధికారి, 48 ఏఎన్ఎంలు, 8 స్టాఫ్‌నర్సులు, 7 ల్యాబ్‌టెక్నిషియన్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. జిల్లా ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ 18, రేడియోగ్రాఫర్ 1, ల్యాబ్ టెక్నిషియన్ 2, మంథనిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ 10, రేడియోగ్రాఫర్ ఒకటి, ల్యాబ్ టెక్నిషియన్ రెండు, సుల్తానాబాద్‌లో స్టాఫ్‌నర్సు ఒకటి చొప్పున ఖాళీలున్నాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 15 ప్రాథమిక, 2 పట్టణ, 61 పల్లె దవాఖానాలు, 2 బస్తీ దవాఖానాలు, 89 ఉప వైద్య కేంద్రాలున్నాయి. 18 వైద్యులు, 1 సీహెచ్‌వో, 2 హెల్త్‌సూపర్‌వైజర్లు, 4 హెల్త్ అసిస్టెంట్ ఆఫీసర్స్, 7 ల్యాబ్‌టెక్నిషియన్లు, 65 హెల్త్‌అసిస్టెంట్లు 4 ఫార్మాసిస్టు, 22 స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్య విధాన పరిషత్ పరిధిలోని సిరిసిల్ల జిల్లా ఆసుపత్రి, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట ఆసుపత్రులో ఇదే పరిస్థితి. సర్జన్లు, ఇతర వైద్య నిపుణుల కొరత సేవలకు ఇబ్బంది తలెత్తుతుంది.

కరీంనగర్ జిల్లాలో 18 ప్రాథమిక, 6 పట్టణ, 97 పల్లె, 4 బస్తీ, వైద్య విధాన పరిషత్‌లో హుజూరాబాద్, జమ్మికుంట ఆసుపత్రులున్నాయి. 7 అసిస్టెంట్ సర్జన్స్, 8 ఫార్మాసిస్టు, 10 ల్యాబ్ టెక్నిషియన్లు, 33 స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. జగిత్యాల జిల్లాలో 15 ప్రాథమిక, 4 పట్టణ ఆరోగ్య, 151 పల్లె, 4 దవాఖానాలతోపాటు జిల్లా ఆసుపత్రితోపాటు కోరుట్ల, మెట్‌పల్లి వైద్యావిధాన పరిషత్ ఆసుపత్రుల్లో అసిస్టెంట్ సర్జన్లు, ల్యాబ్‌టెక్నిషియన్, పార్మాసిస్టులు ఖాళీలున్నాయి.జగిత్యాల జిల్లాలో 15 ప్రాథమిక, 4 పట్టణ ఆరోగ్య, 151 పల్లె, 4 బస్తీ దవాఖానాలు, జిల్లా ఆసుపత్రితోపాటు కోరుట్ల, మెట్‌పల్లి వైద్యావిధాన పరిషత్ ఆసుపత్రులున్నాయి. వీటి పరిధిలో తొమ్మిది వైద్యాధికారులు, నాలుగు స్టాఫ్‌నర్సులు, 6 ఫార్మాసిస్టులు, ఒకటి ల్యాబ్‌టెక్నిషియన్, 70 ఏఎన్ఎంల పోస్టుల ఖాళీలతో రోగులకు వైద్య సేవలు అందడంలేదు.

## అసంపూర్తి పనులు.. మౌలిక వసతుల కరవు

పెద్దపల్లి : ఓదెల మండలం హరిపురం ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. శ్మశాన వాటిక సమీపంలో బడి ఉండటం శవాలను కాల్చివేసే సమయంలో గదుల్లోకి పొగ వస్తుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. రెండేళ్లుగా 'మన ఊరు–మన బడి' పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పర్యవేక్షణలో పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. జిల్లాలో 539 పాఠశాలల్లో 26,215 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి, ఆట స్థలాలు అందుబాటులో లేవు. బడుల్లో ప్రహరీ లేకపోవడంతో పందులు, పశువులు సంచరిస్తున్నాయి. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. వేసవి సెలవుల తర్వాత నేడు పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని భవనాల దుస్థితిపై పరిశీలనాత్మక కథనం.

ఎక్కడి పనులు అక్కడే అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం మన ఊరు–మన బడి కింద 191 పాఠశాలల్లో రూ.కోట్ల నిధులతో హడావుడిగా పనులు ప్రారంభించినా పావలా వంతు ప్రగతి పూర్తికాలేదు. మండలానికి రెండు ఆదర్శ పాఠశాలల్లో నిర్మాణం తప్పా మిగిలిన చోట్ల ముందడుగు పడలేదు. నిధుల కొరత, ఇతర కారణాలతో ప్రగతి ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల 531 పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో చేస్తున్న ప్రగతిలో అదే నిర్లక్ష్యం కొనసాగుతోంది.

**నిధులు విడుదల చేస్తే ప్రయోజనం**

జిల్లాలోని పాఠశాలల్లో సమస్యలు పరిష్కరిస్తేనే విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. అభివృద్ధి నిధులు విడుదల చేస్తే ప్రగతి పరుగులు పెట్టనుంది. విద్యాశాఖ, ఇంజినీరింగ్ శాఖలతో సమీక్షలు తప్పా నిర్మాణ పనులు అసంపూర్తిగా కొనసాగుతున్నాయి. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారే కానీ ఏకరూప దుస్తులు కుట్టే ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు.

## కరకట్ట నిర్మాణం సాకారమయ్యేనా ?

ధర్మపురి : ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరుగాంచిన ధర్మపురి పట్టణానికి ఏటా గోదావరినది వరద తాకిడితో ముప్పు పొంచి ఉంటోంది. కడెం ప్రాజెక్టు నుంచి నీటిని వదిలిన వెంటనే ధర్మపురి ప్రాంతానికి పెద్ద ఎత్తున వరదపోటెత్తుతోంది. వరద నీటి ప్రవాహంతో ఇబ్బందులు లేకుండా ఉండాలంటే కరకట్ట నిర్మాణంతోనే సాధ్యం.

**రూ.4 కోట్లతో ప్రతిపాదన**

గత ఏడాది జులైలో గోదావరినది ఉగ్ర రూపం దాల్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వరద బాధితులకు కట్టుబట్టలే మిగిలాయి. కరకట్ట నిర్మాణంతోనే ధర్మపురిలో వరద నష్టాన్ని శాశ్వతంగా నివారించినట్లవుతుందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు పురపాలకసంఘం అవసరమైన నిధులను ప్రతిపాదనల్లో గత ఏడాది చేర్చింది. ధర్మపురిలో శాశ్వతంగా వరద నివారణ కోసం కరకట్ట నిర్మాణానికి సర్వేలు చేసి రూ.4 కోట్లతో ప్రతిపాదించారు. వరద వల్ల ముంపు వాటిల్లే ప్రదేశాలను పదింటిని గుర్తించారు. వాటిలో తెనుగువాడ, కుమ్మరివాడ, బ్రాహ్మణసంఘం, తెలుగు కళాశాల, రామాలయం, మంగళిగడ్డ, బోయవాడ, ఒడ్డెర



కాలనీ, విద్యుత్తు సబ్‌స్టేషన్, బ్రాహ్మణవాడ, వైశ్యసత్రాలను గుర్తించారు. రెండు లక్షల క్యూసెక్కులకు పైగా నదిలో వరద ఉంటే ధర్మపురికి ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో ముంపు ప్రదేశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరద వచ్చే ప్రదేశాలను ముందస్తుగా ఎలా గుర్తించాలి? తదితర అంశాలపై చర్చించారు. హన్మాండ్ల గడ్డ నుంచి కిందకున్న మహాలక్ష్మిఘాట్ వరకు 2 కిలోమీటర్లకు పైగా నిర్మాణం చేయాలంటే కనీసం రూ.4 కోట్ల వ్యయం అవుతుందని ప్రతిపాదించారు. నిధులు మంజూరైతే ఈ నిర్మాణం చేపట్టే అవకాశముంది. ఈ విషయమై పుర కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడుతూ....వరద ముంపు తప్పించేందుకు కరకట్ట నిర్మాణం చేయాలని ప్రతిపాదించామన్నారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం నిర్మాణం చేపట్టాలని.. నిధులు మంజూరవగానే ప్రారంభించే అవకాశముందని తెలిపారు.

## ఆహారశుద్ధి పరిశ్రమలవైపు అడుగులేవీ!

పెద్దపల్లి : పరిశ్రమల స్థాపనతో కొత్త జిల్లాల్లో అభివృద్ధిని పరుగు పెట్టించాలని గత ప్రభుత్వం చేపట్టిన ప్రణాళిక కార్యరూపం దాల్చలేదు. ఆశించిన మేర ఔత్సాహికులు ఆసక్తి చూపకపోవడం, స్థానికుల నుంచి వ్యతిరేకతతో ఉమ్మడి జిల్లాలో కొత్త పరిశ్రమలేవీ అందుబాటులోకి రాలేదు. ఆహారశుద్ధి పరిశ్రమలతో వ్యవసాయ ఉత్పత్తులకు స్థానికంగానే గిట్టుబాటు ధర లభిస్తుందని భావించినప్పటికీ టీఎస్ ఐపాస్‌లో నిబంధనలు కఠినతరంగా ఉండటం, పరిశ్రమలకు స్థలాలు కేటాయించడంపై వ్యతిరేకత రావడం పారిశ్రామికీకరణ ప్రక్రియకు అవరోధంగా మారాయి. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం 1500 ఎకరాల భూమిని గుర్తించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ఈ దిశగా ముందడుగు పడాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎందుకు ఈ పరిస్థితి!** ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కరీంనగర్ జిల్లాలో ఒబులాపూర్, సిరిసిల్లలో సర్దాల, జగిత్యాలలో స్తంభంపల్లి, మెట్లచిత్తాపూర్, పెద్దపల్లి జిల్లాలో ర్యాకలదేవ్‌పల్లి గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించారు. అతి తక్కువగా ఎలిగేడు మండలం ర్యాకలదేవ్‌పల్లిలో 110 ఎకరాలు, అత్యధికంగా చిగురుమామిడి మండలం ఒబులాపూర్‌లో 500 ఎకరాల స్థలాన్ని అధికారులు గుర్తించారు. గంభీరావుపేట మండలం సర్దాలలో విరుతిళ్ల పరిశ్రమ కోసం భవనం పూర్తయినా ఉత్పత్తి ప్రారంభం కాలేదు. స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. పలువురు ఔత్సాహికులు ఆసక్తి కనబరిచినప్పటికీ మార్కెటింగ్ సమస్యతో వెనుకడుగు వేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆహారశుద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలు సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం.. అక్కడి కంటే అత్యుత్తమ మార్కెట్ ఏర్పాటు చేసుకునే సామర్థ్యం స్థానికంగా లేకపోవడంతో పరిశ్రమలు ఏర్పాటుకు నోచుకోలేదు.

**అనుబంధానికి ఊతమివ్వాలి**

ఉమ్మడి జిల్లాలో 500కు పైగా బియ్యం మిల్లులున్నాయి. వీటిలో వాణిజ్య తరహా ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం అందించాలి. బియ్యం తయారు చేసే మిల్లుల్లోనే ఇడ్లీ రవ్వ, బియ్యం రవ్వతో పాటు బియ్యం ఆధారిత ఇతర ఉత్పత్తుల తయారీకి ఊతం అందించాలి. జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లుల ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచి మార్కెటింగ్ వసతి కల్పించాలి. మామిడి పల్ప్ తయారీని ప్రోత్సహించి విక్రయ సౌకర్యాన్ని అందుబాటులోకి తేవాలి. సింగరేణి సంస్థతో పాటు జిల్లాలోని బియ్యం మిల్లులు, ఇతర పరిశ్రమలకు అవసరమైన ఉత్పాదక సామగ్రిని తయారు చేసే అనుబంధ పరిశ్రమలకు ఊతమివ్వాలి.

**రెండు చోట్ల వ్యతిరేకత**

చిగురుమామిడి మండలం ఒబులాపూర్‌లో ఆహారశుద్ధి పరిశ్రమ స్థాపనను గ్రామస్థులు వ్యతిరేకించారు. తోటపల్లి జలాశయ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలంలో ఆహారశుద్ధి కేంద్రం ఏర్పాటుతో కలిగే ప్రయోజనం కంటే సాగునీటి ప్రాజెక్టుతోనే తమకు మేలు జరుగుతుందని రైతులు స్పష్టం చేశారు. ఈ విషయమై కొందరు కోర్టుకు కూడా వెళ్లడంతో పరిశ్రమ ఏర్పాటు అటకెక్కింది. వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలోనూ ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును రైతులు వ్యతిరేకించారు. ఆ పరిశ్రమతో వాయు, జల కాలుష్యం పెరిగి ప్రజారోగ్యం దెబ్బతింటుందని ఉద్యమించడంతో నిర్మాణం అటకెక్కింది.

**స్థానిక అవసరాలే ప్రామాణికంగా**కొత్త పారిశ్రామిక విధానంపై కసరత్తు చేస్తున్నాం. త్వరలో ప్రకటించి కార్యాచరణ చేపడతాం. స్థానిక అవసరాలే ప్రామాణికంగా పరిశ్రమ లను ఏర్పాటు చేస్తాం. భారీ పరిశ్రమలకు ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. సింగరేణి అనుబంధ పరిశ్రమలను కూడా పారిశ్రామిక పార్కుల్లో ఏర్పాటు చేసేందుకు యత్నిస్తాం. స్థానికంగా పండించే వరి, మిర్చి, పత్తి ఆధారిత పరిశ్రమల కోసం పారిశ్రామికవేత్తలు, మహిళా సంఘాలను ప్రోత్సహిస్తాం. – డి.శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

## ఇంటింటికీ భగీరథ.. ఇంకా దూరమే



పరిగి : 'మిషన్ భగీరథ' పథకంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో అమలు తీరు తెన్నులను నిశితంగా పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా జూన్ 1 నుంచి జులై 17 వరకు గ్రామ కార్యదర్శులతో జిల్లా వ్యాప్తంగా సర్వే చేపట్టింది. వేల కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన పథకంలో అక్రమాలు జరిగాయన్న వాస్తవాలతోపాటు, నిర్వహణ, పర్యవేక్షణ లోపం కనిపిస్తోందని సర్వేలో వెల్లడైంది. దీనికి సంబంధించి కథనం.

**శ్రీశైలం రిజర్వాయిర్ బ్యాక్ వాటర్**

మిషన్ భగీరథ పథకం 2018లో ప్రారంభమైంది. శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌ను 231 కిలోమీటర్ల దూరం నుంచి పరిగి మండలం రాఘవాపూర్ శివారు వరకు తీసుకువచ్చారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ప్లాంటులో రోజుకు 1.35కోట్ల మిలియన్ లీటర్ల నీరు శుద్ధి జరుగుతోంది. జిల్లాలోని నాలుగు పురపాలికలైన వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌తో పాటు 980 ఆవాస గ్రామాల పరిధిలో ప్రతిరోజూ సరఫరా చేస్తున్నారు.

**10 శాతం నల్లాలు లేవు**

నీరు సక్రమంగా అందుతుందా, ఇంటింటికీ బిగించిన నల్లాలున్నాయా లేవా అని సర్వే చేశారు. ట్యాంకుల వద్ద పరిశుభ్రత ఏ విధంగా ఉంది. ప్రస్తుత వర్షాకాలంలో ట్యాంకుల నుంచి నీటిని ఏ విధంగా వదులుతున్నారు తదితర విషయాలపై కూడా ఆరా తీశారు. జిల్లాలో 2016 నుంచి 980 ఆవాస ప్రాంతాల్లో 2.07 లక్షల నల్లాలను బిగించారు. వీటిలో 10 శాతం నల్లాలు లేవని సర్వే నివేదికలు తెలుపుతున్నాయి. సుమారు 21,000 నల్లాలు లేవని గుర్తించారు. ఈ సర్వేలో కేవలం గృహాలనే తీసుకున్నారు. బదులు, ప్రార్థనా స్థలాలను మినహాయించారు. పురపాలికల్లో సర్వే నిర్వహించలేదు. బషీరాబాద్ గ్రామంలో 2991 నల్లాలు బిగిస్తే వీటిలో 297 లేవని తేలింది. జిల్లాలో పాత కొత్తవి కలిపి 1460 ట్యాంకులున్నాయి. 2 వేల కి.మీ. పొడవునా పైపులైన్ వేశారు.

భగీరథ కనెక్షన్ల లెక్క.. పంపిణీ లెక్కలకు సరిపోవడం లేదు. అవసరం ఉన్నా లేకపోయినా ఇష్టారాజ్యంగా కనెక్షన్లు ఇవ్వడంతో ప్రజాధనం వృథాగా మారింది. ఖాళీ ప్లాట్ల ప్రదేశాల్లోనూ కనెక్షన్ల కోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. పట్టణాల్లోని కాలనీల్లో భగీరథ పైపులు ఎక్కడ పడితే అక్కడ ఇష్టమొచ్చు వృథాగా దర్శనమిస్తున్నాయి.

పథకం ప్రారంభం.. 2018

రోజుకు నీటిశుద్ధి.. 1.35 కోట్లమిలియన్ లీటర్లు

భూ ఉపరితల ట్యాంకులు.. 806

ఒక్కొక్కరికి పంపిణీ.. 100 లీటర్లు

ఉమ్మడి రంగారెడ్డి కింద వ్యయం.. రూ.1,800 కోట్లు

ట్యాంకుల శుభ్రతకు అధిక ప్రాధాన్యంబాబుశ్రీనివాస్, ఈఈ, జిల్లా గ్రామీణ తాగునీటి విభాగంమిషన్ భగీరథ నీరు అన్ని ఖనిజ లవణాలు కల్గిన సజల జలం. ట్యాంకుల శుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈ వర్షాకాలంలో ప్రతి రోజు ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను వేయాలని ఆదేశించాం. ట్యాంకుల పరిసరాల్లో ఎక్కడా నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పాం.

## అయినోళ్లే... అపకారులు!



హైదరాబాద్ : తెలిసీ తెలియని వయసు.. ఆప్యాయంగా పలకరిస్తే పొంగిపోయే పసితనం.. ఈ పసిమొగ్గలు తెలిసినోళ్ల చేతిలోనే ఛిద్రమవుతున్నాయి.. వావి వరసలు మరచి మృగాలుగా ప్రవర్తిస్తున్నారు. ఎదురుతిరగలేని నిస్సహాయతను ఆసరా చేసుకొని అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. బడికి తీసుకెళ్లే ఆటోడ్రైవర్ అనుచిత ప్రవర్తనతో ఒక బాలిక బయటి వ్యక్తులను చూస్తేనే భయపడే స్థితికి చేరింది. కన్నతండ్రి తప్పతాగి 14 ఏళ్ల కూతురిపై కన్నేశాడు. తాజాగా మలక్‌పేట్‌లో అంధబాలికపై అత్యాచార ఘటన కలకలం సృష్టించింది. ఇలా.. ఇంటా బయటా.. ఏదో మూలన బాలికలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నగర షీటీమ్స్, మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఊరూవాడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.కాటేస్తున్న కసురప్తులు.. నగర పరిధిలో ఈ ఏడాది 6 నెలల్లోనే 409 పోక్సో కేసులు నమోదయ్యాయి. వీరిలో 90 శాతంమంది ఆ బాలికలకు పరిచయస్తులే. కొందరు రక్త సంబంధీకులున్నారు. పోలీసుల దర్యాప్తులో బాలికలపై లైంగిక దాడులకు పాల్పడినవారిలో స్నేహితులు, మిత్రులు, బంధువులు, డ్రైవర్లు, దుకాణదారులు, వాచ్‌మెన్‌లే ఉంటున్నారు. కసురప్తులే కాటేసిన రీతిలో కన్నబిడ్డలపై కన్నేసి అఘాయిత్యానికి పాల్పడిన నిందితుల జాబితాలో 13 మంది తండ్రులున్నారు. వివిధ కారణాలతో భర్త నుంచి దూరమైన మహిళల్లో కొందరు భద్రత కోసం బిడ్డలతో సహ నచ్చిన పురుషులతో సహజీవనం సాగిస్తున్నారు. మారుతండ్రిగా రక్షణగా నిలవాల్సిన వారు తల్లీబిడ్డల నిస్సహాయతను ఆసరా చేసుకొని చిట్టితల్లులతో లైంగిక అవసరాలు తీర్చుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు.

యుక్తవయసులో ఆకర్షణ వల

అరచేతిలో స్మార్ట్‌ఫోన్లు.. పాఠశాల వయసులోనే ప్రేమ పేరిట వల విసిరే అబ్బాయిల వలలో చిక్కుతున్నారు. పెళ్లయి పిల్లలున్న ప్రబుద్ధులు కూడా బాలికలను నమ్మించి ప్రేమ,పెళ్లి అంటూ దూరప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. ఈ ఏడు బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడినవారిలో 268 మంది బాయ్‌ఫ్రెండ్స్. ప్రతి 100 కేసుల్లో 50శాతం బాధితులు 15–18 సంవత్సరాల బాలికలే. తరువాత స్థానంలో 11–15, 10ఏళ్లలోపు చిన్నారులు వేధింపులు ఎదుర్కొంటున్నారు.

బడులు.. వాడల్లో కార్యక్రమాలు

తాజాగా నగర సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో షీటీమ్స్, మహిళా భద్రతా విభాగం అధికారుల ఆధ్వర్యంలో 300 మంది ఉపాధ్యాయులు, కళాశాలల్లోని 300మంది ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థులకు లైంగికవేధింపులు, దాడులకు పాల్పడేవారి ప్రవర్తన, బయటపడేందుకు అనుసరించాల్సిన పద్ధతులను విద్యార్థినులకు వివరిస్తారు. బ్యాడ్, గుడ్‌టచ్‌పై అవగాహన కల్పిస్తారు. లైంగిక వేధింపులకు గురైన చిన్నారులను గుర్తించడం, పోలీసులకు ఫిర్యాదు చేసే పనిమనసులు.. ఆ భయం నుంచి బయటపడేందుకు తోడ్పాటు అందిస్తారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు వీధివీధినా, కాలనీల్లో కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తారు.

ధైర్యంగా పంచుకునే స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వండి– కవిత దార, డీసీపీ, నగర మహిళా భద్రతా విభాగం

దగ్గరి బంధువులు, పరిచయస్తులే బాలికలు ఒంటరిగా ఉన్న సమయంలో వేధింపులకు దిగుతున్నారు. తల్లిదండ్రులకు చెబితే తమనే తిడతారనే భయం, చదువు మధ్యలో ఆపేస్తారనే ఆందోళనతో మౌనంగా భరిస్తున్నారు. ఇంటా, బయటా ఎదురయ్యే ఎలాంటి సమస్యలైనా ధైర్యంగా పంచుకునేలా పిల్లలకు స్వేచ్ఛనివ్వాలి. ఏం జరిగినా మేమున్నామనే భరోసానిచ్చినప్పుడు కన్నబిడ్డలు తమ ఆవేదన పంచుకుంటారని గుర్తించాలి.నగరవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

## సిటీ పవర్.. నిధులే సవాల్



హైదరాబాద్ : మహానగరం అవుటర్ దాటి ప్రాంతీయ వలయ రహదారి వరకు విస్తరిస్తుండటంతో వచ్చే ఐదేళ్లలో విద్యుత్తు డిమాండ్ రెండింతలు అవుతుందని విద్యుత్తు పంపిణీ సంస్థ అంచనా వేస్తోంది. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా నెట్‌వర్క్ విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పుడున్న ఉపకేంద్రాలు 9371 ఎంవీఏ సామర్థ్యం కల్గి ఉన్నాయి. అదనంగా మరో 3505 ఎంవీఏ సామర్థ్యాన్ని జత చేయాలనేది ప్రణాళిక. ఇందుకోసం రూ.2,650 కోట్ల అంచనాలతో నూతన ఉపకేంద్రాలు, కొత్త విద్యుత్తు లైన్లు, అధునాతన సాంకేతికత ఏర్పాటు వంటి ప్రతిపాదనలను డిస్కం సిద్ధం చేసింది.

ఓవర్‌లోడ్ సమస్య రాకుండా..

నగరం వేగంగా విస్తరిస్తుండటంతో వేసవిలో విద్యుత్తు డిమాండ్ పెరుగుతోంది. ఈ ఏడాదికాలంలో 4352 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైంది. వచ్చే వేసవిలో 5వేల మెగావాట్లను తాకుతుందని అంచనా వేస్తున్నారు. కానీ రాబోయే ఐదేళ్లలో అనూహ్యంగా డిమాండ్ పెరగనున్నట్లు డిస్కం అంచనా వేస్తోంది. ప్రభుత్వం సిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుండటం, బడ్జెట్‌లో వేర్వేరు ప్రాజెక్టులకు రూ.10వేల కోట్ల నిధులు ఇస్తామని చెప్పడం, అవుటర్ వరకు నగరం విస్తరణ, శివారులో పరిశ్రమలకు ప్రోత్సాహం, దాటకేంద్రాలు నిర్మాణం పూర్తి చేసుకుని తమ కార్యకలాపాలను ప్రారంభించనుండటం, అన్ని ప్రాంతాల్లో ఆకాశహర్మ్యాలు వస్తుండటంతో డిమాండ్ భారీగా ఉండనుందని అంచనా వేస్తున్నారు. ఓవర్‌లోడ్ సమస్య రాకుండా కొత్తగా 169వరకు 33/11కేవీ విద్యుత్తు ఉపకేంద్రాలు, 11కేవీ లైన్లు, ఎల్‌టీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రాధాన్యాన్ని బట్టి నిర్మించనున్నారు.

నిధులెలా? : విస్తరణ అవసరమయ్యే భారీ నిధులను సమకూర్చుకోవడం ఎలా అనేదే డిస్కం ముందున్న సవాల్. గతంలో కేంద్ర ప్రభుత్వంలోని పలు పథకాల్లో చేరి గ్రాంట్లను పొందేది. ఇప్పుడు కూడా అలాంటి పథకాల కోసం చూస్తున్నట్లు ఒక అధికారి తెలిపారు.

## నిధులు నిలిచి.. నిర్వహణ కొరవడి!

కరీంనగర్: బడుల బలోపేతంపై దృష్టి నిలుపుతున్న ప్రభుత్వం వాటి నిర్వహణకు నయా పైసా సకాలంలో మంజూరు చేయడంలేదు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలైనా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పాఠశాలల నిర్వహణకు నిధుల కొరత వెంటాడుతోంది. ప్రధానోపాధ్యాయులు సొంతంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

**మంజూరైతే సాఫీగా...**

పాఠశాలలకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రభుత్వం నిర్వహణ నిధులను మంజూరు చేస్తే అవి సాఫీగా కొనసాగుతాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2465 ప్రభుత్వ పాఠశాలలుండగా, 1.60 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఏటా మండల విద్యా వనరుల కేంద్రానికి రూ.90 వేలు, పాఠశాలల కాంప్లెక్స్‌కు రూ.33 వేలు, పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.80 వేల వరకు కేటాయిస్తున్నారు. ఆ నిధులను పాఠశాలల్లో చిన్నచిన్న మరమ్మతులకు, స్టేషనరీ, బిల్లులు వంటి వాటికి చెల్లిస్తారు.

చేయాల్సిన పనులు ఎన్నో..

విద్యాసంవత్సరం ప్రారంభంలో పాఠశాలల నిర్వహణకు నిధులు ప్రభుత్వం మంజూరు చేయని కారణంగా ప్రధానోపాధ్యాయులపైనే భారం పడుతోంది. బడిబాట ఫ్లెక్సీలు, కరపత్రాలు, పాఠశాలల ప్రారంభం రోజున సుద్దముక్కలు, హాజరు రిజిస్టర్లు, ఇతర సామగ్రిని వారే సొంత డబ్బులతో కొనుగోలు చేశారు. పర్వదినాల రోజున వివిధ కార్యక్రమాల నిర్వహణ, బాలలకు మిఠాయిలు, బహుమతుల పంపిణీకీ ఇదే పరిస్థితి. మండల కేంద్రాల నుంచి ఉచిత పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులను పలు దఫాల్లో బడులకు తీసుకెళ్లేందుకు



రవాణా ఖర్చులను సొంతంగానే భరించారు. విద్యాశాఖ ఆదేశాలతో చేపట్టే ప్రత్యేక కార్యక్రమాలకూ ఖర్చులు తప్పడం లేదు. నిధుల లేమితో ఇక పాఠశాలలకు, తరగతి గదులకు అవసరమైన మైనర్ మరమ్మతుల జోలికి ఎవరూ వెళ్లడం లేదు. అంతర్జాలం, విద్యుత్తు బిల్లుల బకాయిలు చెల్లించడంలేదు. ఉమ్మడి జిల్లాలోని మెజారిటీ పాఠశాలల్లో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లే ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. పాఠశాలల నిర్వహణకు నిధులు లేని కారణంగా ఆ బాధ్యత నుంచి తప్పుకోవాలని కొందరు ఆలోచిస్తున్నారు. ఈ విషయమై కరీంనగర్ డీఈవో జనార్దన్‌రావును వివరణ కోరగా.. ప్రభుత్వం త్వరలోనే నిధులు మంజూరు చేస్తుందన్నారు.

**క్రీడలపై ఆది నుంచి నిర్లక్ష్యమే...**ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పీఈటీలకు ఇటీవల పీడీలుగా పదోన్నతులను విద్యాశాఖ కల్పించింది. పాఠశాలల్లో వీరు అందించే క్రీడా కార్యక్రమాలకు పరికరాల కొరత, అసౌకర్యంగా మారిన మైదానా లు అడ్డంకిగా మారాయి. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు అందించని కారణంగా వారి సేవలు ప్రార్థన, విద్యార్థులను క్రమశిక్షణతో నిలిపే వరకే పరిమితమవుతున్నాయి. విద్యార్థులు బడుల్లో యాంత్రిక జీవనానికి అలవాటు పడి క్రీడలకు దూరంగా నిలుస్తున్న దుస్థితి నెలకొంది.

## అదనపు బాధ్యతలతో పర్యవేక్షణ మృగ్యం

పెద్దపల్లి : జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పర్యవేక్షణ, విద్యా ప్రగతిని సమీక్షించే మండల విద్యాశాఖ అధికారులకు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారే ఉండటంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మొత్తం 14 మండలాలకు అయిదుగురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా మూడు, నాలుగేసి మండలాల బాధ్యతలు చూస్తున్నారు. ఓవైపు ప్రధానోపాధ్యాయుడిగా పాఠశాల, ఎంఈవోగా మండల విద్యాశాఖ బాధ్యతలతో తలకు మించిన భారంగా మారింది. అందరూ ఇన్‌ఛార్జి అధికారులే కావడంతో పర్యవేక్షణ గాడి తప్పుతోంది. ఒకరికి మూడు కంటే ఎక్కువ మండలాలు

జిల్లావ్యాప్తంగా అయిదుగురు ఇన్‌ఛార్జి ఎంఈవోలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో సురేందర్‌కుమార్ పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్, రామగిరి మండలాలు, లక్ష్మీ మంథని, ముత్తారం మండలాలు, కవిత జూలపల్లి, ఎలిగేడు మండలాలు, ఛాయాదేవి ధర్మారం మండలం, రాజయ్య రామగుండం, పాలకుర్తి, అంతర్గాం, ఓదెల మండలాలకు విద్యాశాఖ అధికారులుగా వ్యవహరిస్తున్నారు. ధర్మారం ఎంఈవో మినహా మిగిలిన అధికారులకు మూడు కంటే ఎక్కువ మండలాల బాధ్యతలు చూస్తున్నారు. మండలానికి ఒక ఎంఈవో నియామకంపై విద్యాశాఖ చర్యలు తీసుకోవడం లేదు.

**ఇవీ సమస్యలు**

జిల్లాలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అధిక ఫీజులు వసూలు, బడిలోనే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు విక్రయిస్తుండగా నియంత్రణ కరవైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చాలా చోట్ల ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. బయోమెట్రిక్ లేకపోవడంతో ఆలస్యంగా విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలున్నాయి.

ఇన్‌ఛార్జి ఎంఈవోలు పాఠశాల సముదాయ సమావేశాలు, మండల, జిల్లా సమీక్ష సమావేశాలకు వెళ్లాల్సి ఉండటంతో తనిఖీలు నామమాత్రంగా మారాయి.విద్యాసంవత్సరం ప్రారంభమై ఒకటిన్నర నెలలు దాటినా ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ లేక నాణ్యత లోపిస్తోంది. అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రగతి ఆందోళన కలిగిస్తోంది.తొలిమెట్టు, ఉన్నతి వంటి కార్యక్రమాల అమలుపై నిర్లక్ష్యం కనిపిస్తోంది. విద్యార్థుల్లో నానాటికీ సామర్థ్యాలు పడిపోతున్నాయి. అక్షర ప్రగతి లేని చోట ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లేదు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం


జిల్లాలోని 14 మండలాల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. పాఠశాలలపై పర్యవేక్షణలో ఎలాంటి లోపం లేదు. ఎంఈవోలు తమ పరిధిలోని పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నాం.–మాధవి, జిల్లా విద్యాధికారి

# అల్పాహారం అందేనా?

కోదాడ : ఖాళీ కడుపుతో పాఠశాలలకు వస్తున్న బాలల ఆకలిని తీర్చి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలనే లక్ష్యంతో గత సర్కారు పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించింది. గత విద్యా సంవత్సరం ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా వివిధ జిల్లాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో అమలు చేశారు. ఈ విద్యాసంవత్సరం పూర్తిగా అమలు చేయాలనే లక్ష్యంతో ఉండగానే ప్రభుత్వాలు మారాయి. వాటి ప్రాధాన్యాలు మారుతున్నాయి. ఫలితంగా ఇప్పటి వరకు ప్రభుత్వం పేద విద్యార్థులకు అల్పాహారం అందించే విషయాన్ని ఇంకా పరిశీలించలేదు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావొస్తుంది. విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజన కార్యక్రమాలపై దృష్టి సారించిన ప్రభుత్వం అల్పాహారంపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

**ఇలా అనుకున్నారు..**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం ఆహారం ఇవ్వకుండా నేరుగా బడికి పంపిస్తున్న తల్లిదండ్రుల సంఖ్య అధికంగా ఉందని అప్పటి ప్రభుత్వం ఒక సర్వే చేసి గుర్తించింది. ఇలా వచ్చిన విద్యార్థులు మధ్యాహ్న భోజనం పెట్టే వరకు ఖాళీ కడుపులతోనే ఉంటున్నారని, వారికి అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రోజుకో రకమైన అల్పాహారం ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ముందుగా ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో మొదట అమలు చేశారు.



అందులో భాగంగా సూర్యాపేట జిల్లాలో 74 పాఠశాలల్లో అమలు చేశారు. విద్యార్థులు అల్పాహారంపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారన్న విషయాన్ని కూడా అప్పుడు గుర్తించారు. గత సంవత్సరం అక్టోబరులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆ విద్యాసంవత్సరం వరకు కొనసాగించారు. వీటి బాధ్యతను ఎక్కువ చోట్ల మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీలకే అప్పగించారు.

**బకాయిలు విడుదల చేసినా..**

గత విద్యాసంవత్సరం అక్టోబరు నెల నుంచి పెట్టిన అల్పాహారం బిల్లులు ఇటీవలే విడుదల చేసింది. కానీ మళ్లీ దీని అమలుపై స్పష్టత ఇవ్వలేదు. ఈ విద్యాసంవత్సరం ఇక అల్పాహార కార్యక్రమం ఉండకపోవచ్చునని అధికారులు అంటున్నారు. బిల్లులు చెల్లించే క్రమంలోనే వాటి అమలుపై కీలక ప్రకటన వస్తుందని అందరూ ఎదురు చూశారు. కాని ప్రభుత్వం ప్రకటన చేయకపోవడంతో నిరాశ చెందారు.

**ఆదేశాలు రాలేదు: అశోక్, జిల్లా విద్యాధికారి, సూర్యాపేట**

గత సంవత్సరం జిల్లాలో 74 పాఠశాలల్లో అల్పాహారం అమలు చేశాం. ఈ విద్యా సంత్సరానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. రాగానే అమలు చేస్తాం.

# 1 నుంచి క్యూఆర్ కోడ్

భానుపురి : విద్యుత్తు బిల్లుల చెల్లింపునకు ఇక నుంచి క్యూఆర్ కోడ్ అమలు కానుంది. ఆగస్టు 1 నుంచి ఈ విధానం అమలు జరిపేందుకు టీజీఎస్పీడీసీఎల్ 'క్యూఆర్ కోడ్' విధానాన్ని ప్రవేశపెడుతోంది. గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం, తదితర యాప్‌ల ద్వారా కొన్నేళ్లుగా వినియోగదారులు బిల్లులు చెల్లిస్తుండగా.. జులై 1 నుంచి ఆయా సేవలను ఆర్‌బీఐ నిలిపివేసింది. దీంతో విద్యుత్తు పంపిణీ సంస్థ టీజీఎస్పీడీసీఎల్ ప్రత్యేకంగా యాప్ రూపొందించింది. డిస్కమ్ వెబ్‌సైట్ %https:///tgspdcl.com% ద్వారా చెల్లించే అవకాశం కల్పించింది. బిల్లులు చెల్లించే సమయంలో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యాప్‌లను ఎంచుకోవచ్చు. డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వ్యాలెట్లు, క్యాష్ కార్డులతోపాటు బిల్లు కౌంటర్లు, ఈ-సేవ, మీ-సేవల్లో చెల్లింపులు చేపట్టేందుకు వెసులుబాటు ఉంది.

**సులభతరం చేసేందుకు..**

ఆగస్టు 1 నుంచి బిల్లులపై క్యూఆర్ కోడ్ రానుంది. వినియోగదారులకు బిల్లు చెల్లింపులు సులభతరంగా ఉండేందుకు సంస్థ ఈ విధానం




అమలు పరుస్తోంది. ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో దీనిపై ప్రచారం చేస్తున్నారు. ఈ 'క్యూఆర్ కోడ్'తో స్కాన్ చేసి తేలికగా బిల్లు చెల్లించవచ్చు. ఈ కోడ్‌తో ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌ల్లో స్కాన్‌చేయాలి. తద్వారా %https:///www.billdesk.com/pgidsk/pgmerc%ª అనే లింక్ కనిపిస్తుంది. దీనిపై క్లిక్ చేస్తే సంస్థ యాప్ ఓపెన్ అవుతుంది. దీనిపై యూఎస్‌సీ నెంబరు సబ్మిట్ చేస్తే వినియోగదారుడి పేరు, చెల్లించాల్సిన బిల్లు మొత్తం కనిపిస్తుంది. దీన్ని సరిచూసుకొని క్రెడిట్, ఏటీఎం కార్డు, నెట్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా చెల్లించవచ్చు. బిల్లు సర్వీసుకు జమయ్యాక సంస్థ నుంచి ఎస్‌ఎంఎస్ వస్తుంది. ఇక నుంచి క్యూఆర్ కోడ్‌తో బిల్లులు చెల్లించాలని డిస్కం డీఈ శ్రీనివాస్‌కు తెలిపారు.

# రెండో విడత రుణమాఫీ షురూ..



తాండూరు: ప్రభుత్వం రెండో విడత రుణమాఫీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో రూ.1.5లక్షల లోపు రెండో విడత రుణమాఫీ కింద 23,912 మంది రైతులు లబ్ధి పొందారు. వీరికి సంబంధించిన మొత్తం రూ.240 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో జమచేసే ప్రక్రియను ప్రారంభించింది.

**అన్నదాతల సంబురం**

గత 2023 నవంబరు ఎన్నికలకు సంబంధించిన మ్యానిఫెస్టోలో రూ.2లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే రుణాలను ఆగస్టు 15లోపు మాఫీ చేస్తామని మరోసారి ప్రకటించింది. తర్వాత రూ.లక్షలోపు రుణాలను జులై 18న మొదటి విడతలో మాఫీ చేసింది. అప్పట్లో 46,633 మందికి రూ.256.26 కోట్లను ఖాతాల్లో జమచేసింది. అయితే బ్యాంకు ఖాతాలో ఒక పేరు, ఆధార్‌లో మరో పేరు ఉన్న రైతులకు రుణాలు మాఫీ కాక కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. వీటిని సవరించేందుకు అధికారులు పని చేస్తున్నారు. ప్రస్తుతం రుణమాఫీ అయిన జాబితాలో తమ పేరు ఉండడాన్ని చూసుకుని రైతులు సంబర పడి పోతున్నారు.

**మొత్తం రైతులు 2.97 లక్షల మంది**

జిల్లాలోని 20 మండలాల్లో 2.97 లక్షల మంది ఉన్నారు. వీరందరికీ కలిసి 6లక్షల ఎకరాల సాగు భూములు ఉన్నాయి. చాలా మంది రైతులు వర్షాధారం కింద ఏడాదికి ఒకే పంటను సాగు చేస్తున్నారు. మిగిలిన రైతులకు నీటి వసతి ఉండడంతో ఒకటి నుంచి మూడు పంటలను సాగు చేస్తున్నారు. బ్యాంకులు వానాకాలం, యాసంగి సాగు కోసం ఇచ్చే పంట రుణాలను తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. మరి కొందరు రైతులు ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణీత బ్యాంకుల్లో భూములను మార్టిగేజ్ చేసి రుణాలు తీసుకుంటున్నారు. ఇలాంటి వారికి రుణమాఫీ అయ్యే అవకాశం లేదు.

**ఆగస్టు 15లోపు మిగిలిన రైతులకు..**

వచ్చే ఆగస్టు 15లోపు రూ.2 లక్షల లోపు రుణాలు తీసుకున్న వారు లబ్ధి పొందనున్నారు. ఇప్పటికే తొలి, మలి విడతల్లో కలిపి 73,071 మంది రైతులు రూ.521.26 కోట్ల రుణం నుంచి విముక్తి పొందిన వారయ్యారు. ప్రస్తుతం రుణమాఫీ అయిన రైతులు మరోసారి కొత్తగా పంటరుణాలు తీసుకునే ప్రక్రియను ప్రారంభించారు. కొంత మంది ఇప్పటికే రుణాలను తీసుకుని పెట్టుబడిగా వినియోగిస్తున్నారు.

**ఆరుతడి పంటల సాగు రైతులకే ఎక్కువ**

మొదటి విడత రుణమాఫీలో చిన్న, సన్నకారు రైతులు ఎక్కువ లబ్ధి పొందారు. రెండో విడత రుణమాఫీలో మాత్రం ఎక్కువ భూ విస్తీర్ణం, బోర్లు, బావులు ఉండి ఆరుతడి పంటలు సాగు చేస్తున్న రైతులు ఉన్నారు.

**రూ.1.20 లక్షల రుణం నుంచి విముక్తి పొందాం**

**వడ్ల చంద్రకళ, పెద్దేముల్**

గతేడాది 3.20 ఎకరాల్లో చెరకు, పత్తి పంట సాగు కోసం భార్య, భర్తలం ఇద్దరం రూ.1.20 లక్షల పంట రుణం తీసుకున్నాం. రెండో విడతలో మొత్తం రుణం మాఫీ అయింది. చాలా సంతోషంగా ఉంది. పంటల సాగు కోసం మళ్లీ రుణం తీసుకుంటాం.

# సూక్ష్మంలో ఉపాధి మోక్షం



హైదరాబాద్: నగరంలో అత్యధికమందికి ఉపాధి అనగానే ఐటీ, ఫార్మా, రియల్ ఎస్టేట్ రంగాల పేర్లు వినపడుతుంటాయి. వీటి కోసం అనుబంధంగా ఎన్నో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్‌ఎంఈలు) పరిశ్రమలు నగరం కేంద్రంగా పనిచేస్తున్నాయి. పెద్ద సంఖ్యలో కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఉత్పత్తి, సర్వీస్ సెక్టార్లలో ఎంఎస్‌ఎంఈలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన తెలంగాణ సామాజిక నివేదిక-24లో జిల్లాల వారీగా యూనిట్ల సంఖ్యను వెల్లడించింది.

నగరంలో 33 లక్షల మంది వేర్వేరు రంగాల్లో ఉపాధి పొందుతుంటే.. అందులో అత్యధిక మంది ఎంఎస్‌ఎంఈల్లోనే ఉన్నారు. వార్షిక ఆదాయం రూ.కోటి నుంచి రూ.250 కోట్లలోపు ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో వీరు ఉపాధి పొందుతున్నారు.

హైదరాబాద్ జిల్లాలో.. రాజధాని కావడంతో రాష్ట్రంలోనే అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో ఎంఎస్‌ఎంఈ యూనిట్లు ఉన్నాయి. ఇక్కడ 1,68,077 ఎంఎస్‌ఎంఈలు ఉంటే.. ఇందులో 1,33,937 యూనిట్లు సర్వీస్ విభాగంలో ఉన్నాయి. మిగతా 34,140 యూనిట్లు ఉత్పత్తి రంగంలో ఉన్నాయి.

ఇందులో సూక్ష్మ సంస్థలు అత్యధికంగా 1,56,642 యూనిట్లు పనిచేస్తున్నాయి. చిన్నతరహావి 9,813, మధ్యతరహావి 1,622 దాకా ఉన్నాయి.

రంగారెడ్డి జిల్లాలో.. లక్షపైన ఎంఎస్‌ఎంఈలు ఉన్న జిల్లాల్లో రంగారెడ్డి రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 1,09,164 యూనిట్లు ఉండగా.. అందులో 87,376 సేవా రంగానికి చెందినవే. మిగిలిన 21,788 ఉత్పత్తి రంగంలో పనిచేస్తున్నాయి.

సూక్ష్మ సంస్థల సంఖ్యనే 1,04,846గా ఉంది. రూ.కోటిలోపు పెట్టుబడి, రూ.5 కోట్లలోపు టర్నోవర్ కల్గిన వాటిని సూక్ష్మ సంస్థలుగా పరిగణిస్తారు.

జూన్ 2024 వరకు ఉన్న వివరాల ప్రకారం చిన్న తరహా 3,866, మధ్యతరహా పరిశ్రమలు 452 మాత్రమే ఉన్నాయి.

మేడ్చల్ జిల్లాలో.. ఎంఎస్‌ఎంఈలు మొత్తం 92,235 యూనిట్లు ఉండగా.. ఇందులో సేవా రంగంలో 63,874, ఉత్పత్తిలో 28,361 సంస్థలు ఉన్నాయి.

సూక్ష్మ సంస్థలు 88,037 యూనిట్లు ఉన్నాయి. ఒక్కో సంస్థలో ఇద్దరి నుంచి 8 మంది వరకు ఉపాధి లభిస్తుంది.

రూ.10 కోట్లలోపు పెట్టుబడులు, రూ.50 కోట్ల టర్నోవర్ ఉండే చిన్నతరహా పరిశ్రమలు 3,821 ఉన్నాయి.

రూ.50 కోట్లలోపు పెట్టుబడులు, రూ.250 కోట్ల టర్నోవర్ కల్గిన మధ్యతరహా పరిశ్రమలు 377 ఉన్నాయి.

# ప్రోత్సాహం అందక.. క్రీడా పరికరాల్లేక..




వికారాబాద్: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసి నైపుణ్యం మెరుగు పర్చేందుకు 'పల్లె ప్రగతి'లో భాగంగా జిల్లాలో క్రీడా ప్రాంగణాలు (టీకేపీ) ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ నిధుల నుంచి ఒక్కో క్రీడా మైదానం నిర్మాణానికి రూ.4.17 లక్షల అంచనా వ్యయంతో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులతో పాటు లాంగ్ జంప్, పిట్ డబుల్ బార్, సింగిల్ బార్ ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లాలోని 566 గ్రామ పంచాయతీలు, 149 ఆవాసాల్లో 715 క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం కాగా, 381 పూర్తి చేశారు. 27 ప్రాంగణాలు పురోగతిలో ఉన్నాయి. అయితే సరైన ఆట వస్తువులు, ఔత్సాహికులకు ప్రోత్సాహం అందక జిల్లాలోని 75 శాతానికి పైగా క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారి లక్ష్యానికి దూరంగా నిలిచాయి. దీనికి సంబంధించి కథనం.

**ప్రభుత్వ భూముల్లేక అవస్థలు..**

గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను నిర్మించేందుకు అవసరమైన ప్రభుత్వ భూములు లభించకపోవడంతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీల జనాభా ఆధారంగా అర ఎకరం, ఎకరం భూమి ఉంటే అందులో క్రీడా ప్రాంగణాన్ని నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా ఉండే భూములు దొరకడం లేదు. జిల్లాలో 307 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలకు అవసరమైన స్థలం లభించడం లేదు.

**అటకెక్కిన కిట్ల మంజూరు ప్రణాళికలు**

జిల్లాలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పంజాబ్ రాష్ట్రం నుంచి వచ్చిన ఆట వస్తువుల కిట్లను అందజేయడానికి నిరుడు ప్రణాళికలు రూపొందించారు. అవి ప్రస్తుతం అటకెక్కాయి.

**కనీసం ఈసారైనా ఇస్తారా..**

క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తాజాగా ఒక్కో క్రీడా ప్రాంగణానికి 2 కిట్లు(సంచులు), 23 ఆట వస్తువులతో పాటు 75 టి-షర్టులను అందజేయాలని అధికారులు నిర్ణయించారు. కనీసం ఈ సారైనా ఇస్తారా అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. మండలానికో బఫర్ కిట్‌తో పాటు జిల్లా స్థాయిలో అదనంగా మరో 40 కిట్లను అందుబాటులో ఉంచుతారు. గతంలో కొన్ని క్రీడా ప్రాంగణాల ఏర్పాటు సమయంలో వాలీబాల్, నెట్స్‌ను కొనుగోలు చేసినా ఎవరికి అందజేయాలో స్పష్టత లేక మూలన పడేశారు. కిట్ల పంపిణీకి జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షునిగా ఉండే కమిటీలో అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, డీపీఓ, జిల్లా యువజన క్రీడల అధికారి, కలెక్టర్ నియమించే అధికారైనా కన్వీనర్లుగా వ్యవహరిస్తారు. వీరితోపాటు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి ప్రజా ప్రతినిధులు ఉంటారు.

# సాగు ముందుకు!

భువనగిరి : వానాకాలం సీజన్‌లో మొన్నటి వరకు వర్షాలు లేక రైతులు డీలా పడ్డారు. ఇటీవల కురిసిన వర్షాలు వారిలో ఆశలు నింపాయి. మెట్ట పంటలకు ప్రాణం పోశాయి. సాగుబడి జోరుగా సాగుతోంది. గత ఏడాది వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పంటలు కలిపి 4.35 లక్షల ఎకరాల్లో సాగుచేయగా.. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 2.26 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. మంగళవారం నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 248.3 మి.మీటర్లు కాగా 236.0 మిమీ మాత్రమే కురిసింది. చౌటుప్పల్, గుండాల మండలాల్లో ఇంకా లోటు వర్షపాతమే ఉంది.

ఆశాజనకంగా పత్తి... పత్తి పరిస్థితి ఆశాజనకంగా ఉంది. వరి తరువాత జిల్లాలో అత్యధిక సాగు జరిగేది పత్తే. జిల్లాలో గత ఏడాది 1,02,000 ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఈ సారి 1,00,514 ఎకరాల్లో మాత్రమే వేశారు. తొలకరి వర్షాలకే జిల్లాలో పత్తి విత్తారు. జూన్, జులై నెలల మధ్యలో వర్షాలు లేకపోయినా తదుపరి కురిసిన వర్షాలు పత్తికి ప్రాణం పోశాయి. పత్తిచేన్లు బాగా ఎదుగుతున్నాయి. వలిగొండ, భువనగిరి, మోత్కూరు, నారాయణపూరం, ఆత్మకూర్, మోటకొండూరు, ఆలేరు మండలాల్లో పత్తిని ఎక్కువగా సాగు చేస్తారు. మూసీ పరీవాహకంలో.. వరి... మూసీ పరీవాహక ప్రాంత మండలాల్లో వరిసాగు ముమ్మరంగా సాగుతుంది. గత ఏడాది 3,05,000 ఎకరాల్లో సాగు చేయగా ఈ సారి వారం క్రితం నాటికి సుమారు 1.15 ఎకరాల్లో సాగు చేశారు. అనధికారికంగా 1.80లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మూసీ కాలువ ద్వారా



బీబీనగర్, రామన్నపేట, వలిగొండ, భూదాన్‌పోచంపల్లి, భువనగిరి మండలాల్లో అత్యధికంగా వరినాట్లు వేశారు. ఒక్కో మండలంలో 20 వేల ఎకరాలకు పైగా నాట్లు వేశారు. నారాయణపురంలో అత్యల్పంగా 700 ఎకరాల లోపు సాగైంది. బొమ్మలరామారం, చౌటుప్పల్, తుర్కపల్లి, మోత్కూరు, అడ్డగుడూరు మండలాల్లో 3వేల లోపు ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఆగస్టు రెండో వారం నాటి సాగు విస్తీర్ణం పెరుగుతుంది. మెట్ట పంటలైన కందిని 2,344, పెసర్లు 74, మొక్కజొన్న 32, నువ్వు 13, వేరుసెనగ 17 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఇతర పంట సాగు విస్తీర్ణం రెండు అంకెలు కూడా దాటలేదు.

ఆగస్టు రెండో వారం నాటికి వరినాట్లు పూర్తి

– అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారిణి

వర్షాలు ఆలస్యంగా రావడంతో పంటల సాగులో జాప్యం జరిగింది. ప్రధానంగా వరినాట్లు ఇప్పుడిప్పుడే ముమ్మరంగా జరుగుతున్నాయి. గత వారం నివేదిక ప్రకారం 1.16 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం 1.70 లక్షల ఎకరాలకు చేరిందని అంచనా వేస్తున్నాం. గత ఏడాది 3.10లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పుడు కొంత మేరకు తగ్గవచ్చు. పత్తి చేనుల పరిస్థితి పర్వాలేదు. మెట్ట పంటల సాగు మాత్రం తగ్గింది.

# కాన్పు కష్టాలు..!

సూర్యాపేట : సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతా శిశు కేంద్రంలో కొద్ది రోజులుగా చేస్తున్న శస్త్ర చికిత్సలు వికటిస్తున్నాయి. వైద్యులు, సిబ్బంది వారికి సక్రమంగా కుట్లు వేయకపోవడంతో బాలింతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారం వ్యవధిలో ఇక్కడ శస్త్ర చికిత్సలు చేయించుకున్న సుమారు పది మంది వరకు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వారంతా ప్రస్తుతం హైదరాబాద్, ఖమ్మం, సూర్యాపేట తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించినట్లు సమాచారం. గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన బత్తిని శ్రుతి, ఖలీఫా ఇద్దరు గర్భిణులను ఒకే రోజు (ఈ నెల 22న) మొదటి



కాన్పు కోసం బంధువులు 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకొచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఇద్దరికీ మైనర్ ఆపరేషన్ చేసి పురుడు పోశారు. మూడు రోజుల తర్వాత వారిని డిశ్చార్జి చేసి ఇంటికి పంపించారు. శస్త్ర చికిత్స సందర్భంగా వేసిన కుట్లు నాలుగో రోజు ఊడిపోయాయి. రక్తస్రావం కావడంతో శ్రుతిని నేరేడుచర్లలోని ప్రైవేటు ఆసుపత్రికి, ఖలీఫాను సూర్యాపేటలోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించి కుట్లను సరి చేయించుకున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

**నిర్లక్ష్యపు సమాధానం**

– షేక్ మౌలానా, ఖలీఫా తండ్రి, పొనుగోడు

ఊడిపోయిన కుట్లతో తన కూతురు ఖలీఫాను మంగళవారం ఆసుపత్రికి తీసుకెళ్తే సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రిలో కాన్పు చేయించుకునే స్థోమత లేకపోవడంతోనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాం. మాతోపాటు మరో ముగ్గురూ ఇదే సమస్యతో వచ్చారు. మరోసారి తన కుమార్తె ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టలేక సూర్యాపేటలోనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాను. రూ.10 వేల ఖర్చు అవుతోంది. మొదటే ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి ఉండాల్సింది అనిపిస్తోంది.

**కారణాలు తెలుసుకోవాలి**

– శ్రీకాంత్ భట్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

బాలింత శరీర తత్వాన్ని బట్టి సమస్యలు ఎదురవుతుంటాయి. వైద్యుల నిర్లక్ష్యమే కారణమనడం సరికాదు. సర్జరీ తర్వాత ఇన్‌ఫెక్షన్ రాకుండా తగిన స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలి. సమయానుకూలంగా యాంటిబయాటిక్ మాత్రలు తీసుకోవాలి. కొంత మంది రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి సైతం కుట్లు త్వరగా మానవు. వివిధ రకాల సమస్యలు ఉంటాయి. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారా అన్న కోణంలోనూ విచారిస్తాం. సమస్య ఉన్న వారు ఆసుపత్రికి వస్తే తిరిగి చికిత్స అందిస్తాం.

# వరి విత్తనం.. మరింత భారం

హుజూరాబాద్ : వర్షాకాలం పంటల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. వరి నారుమడులు పోయడానికి సిద్ధమవుతుండగా.. ప్రైవేటు కంపెనీలు బ్రాండ్ల పేరిట వరి విత్తనాల ధరలను పెంచేశాయి. 25, 30 కిలోల బస్తాల సర్టిఫైడ్ విత్తనాలకు అదనంగా రూ.100 నుంచి రూ.120 వరకు పెంచి విక్రయిస్తున్నారు. వత్తి మినహా మిగతా పంట విత్తనాల విక్రయాలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో సంబంధిత యజమానులు ఇష్టారీతిన ధరలు నిర్ణయిస్తున్నారు. ప్రభుత్వ రాయితీపై కూడా లేకపోవడంతో రైతులపై అదనపు భారం పడుతోంది.

2,41,218 క్వింటాళ్లు అవసరం

ఉమ్మడి జిల్లాలో అన్నదాతలు అత్యధికంగా వరి సాగు చేస్తారు. అందుకు అనుగుణంగా ప్రస్తుత వానాకాలంలో 9,65,044 ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందుకు 2,41,218 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని కూడా లెక్కలు వేసింది. దీన్ని ఆసరాగా చేసుకొనే విత్తన కంపెనీలు రూ.100 నుంచి రూ.120 వరకు ధరలను పెంచారు. గతేడాది ఇదే సీజన్‌లో సర్టిఫైడ్ సన్నరకం 25 కిలోల విత్తన బ్యాగ్‌కు రూ.850.. 30 కిలోల దొడ్డురకం సంచికి రూ.900 కాగా.. ఇప్పుడు వరుసగా రూ.950 రూ.1,020 చొప్పున విక్రయిస్తున్నారు. ఏటేటా వరి సాగు పెరగడంతో విత్తన కంపెనీలు ధరలను పెంచి తమపై ఆర్థిక భారం మోపుతున్నాయని రైతులు వాపోతున్నారు. రైతుల వద్ద ఎక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేయాల్సి వచ్చినందుకే ధరలు పెంచక తప్పలేదని విత్తన కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.

రాయితీ విత్తనాలు లేకే..గతంలో అన్ని రకాల విత్తనాలను 50 శాతం



రాయితీపై ప్రభుత్వం అందించేది. కానీ కొన్నేళ్లుగా జనుము, జీలుగ విత్తనాలను మాత్రమే పంపిణీ చేస్తోంది. దీంతో రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద పంటల విత్తనాలను పూర్తి ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకొని వివిధ సీడ్ కంపెనీలు బీపీటీ, ఆర్ఎన్ఆర్, ఎంటీయూ, కెఎన్ఎం, ఐఆర్, జేజీఎల్ రకాల విత్తనాలకు ఇష్టారీతిన ధరలను పెంచి ప్రైవేటు డీలర్ల ద్వారా విక్రయాలకు జరుపుతున్నాయి. ఖరీఫ్ నుంచి రాయితీపై విత్తనాలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అమలు సాధ్యం కాకపోవడంతో రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్నారు.

సాగు ప్రారంభంలోనే బాదుడు

ఎకరా భూమిలో వరి నాటుకు కనీసం 25 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. మొలక శాతం బాగా లేకుంటే మరో 10 కిలోలు అదనంగా కావాలి. ఈ లెక్కన చూస్తే వరి విత్తన ధరలు పెంచటంతో ఉమ్మడి జిల్లాలోని రైతులపై రూ.9.50 కోట్ల అదనపు భారం పడనుంది. సర్టిఫైడ్(లోకల్ సీడ్) విత్తనాలనే ఆయా కంపెనీలు వివిధ బ్రాండ్ల పేరిట ధరలు పెంచి విక్రయిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు ప్రారంభంలోనే బాదుడు మొదలుకావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు– బి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి

ప్రైవేటు కంపెనీలు వరి విత్తనాల ధరలు పెంచినట్లు తమ దృష్టికి వచ్చింది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి.

# పూడిక నుంచి రక్షణ ఎలా?

సిరిసిల్ల : మధ్యమానేరు జలాశయంలోకి పూడిక చేరకుండా చేపట్టే నియంత్రణ చర్యలేవీ ముందుకు సాగడం లేదు. నిర్మాణం పూర్తయిన 2017 సెప్టెంబరు నుంచి జలాశయంలో నీటిని నింపడం ప్రారంభించారు. దీని పూర్తి సామర్థ్యం 27.873 టీఎంసీలుగా కాగా, ఏటా వర్షాలకు నీటి నిల్వతో కళకళలాడుతోంది. మానేరు, మూలవాగుల నుంచి స్థానిక అవసరాలకు ఏటా రెండు లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు స్థానిక రెవెన్యూశాఖ అనుమతులిస్తుంది. వీటితో ఇప్పటికే గంభీరావుపేట, కోనరావుపేట మండలాల పరిధిలోని వాగుల్లో అసలు ఇసుక నిల్వలే లేవు. ఇసుక తరలింపుపై నియంత్రణ లేకపోవడంతో వాగుల్లో పెద్ద ఎత్తున గోతులు ఏర్పడ్డాయి. భారీ వర్షాలకు వీటిని కప్పిపెడుతూ వచ్చే వరదతో ఇసుక మేటలు వేస్తాయి. దీంతో భవిష్యత్తులో జలాశయానికి పూడిక ముంపు పొంచి ఉంది.

జలాశయంలోకి మానేరువాగు 25 కిలోమీటర్లు, మూలవాగు 36 కిలోమీటర్లు పొడవుతో రెండు వాగులు ప్రవహించి జలాశయంలో కలుస్తాయి. వర్షాకాలం మానేరువాగులో 3,500 (ఎంసీఎఫ్టీ) మిలియన్ క్యూబిక్ ఫీట్లు, మూలవాగులో 4,500 ఎంసీఎఫ్టీల నీటి లభ్యత ఉంటుంది. ఈ రెండు వాగులపై జలాశయం చివరన చెక్‌డ్యాంలు నిర్మిస్తే పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతోపాటు భూగర్భ జలమట్టం నిలకడగా ఉంటుంది.


2019లోనే రెండు వాగులపై 12 చెక్‌డ్యాంలు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటికీ చాలా వరకు అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ రెండు వాగుల పరిధిలో భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగి, వరద ఉద్ధృతితో మధ్యమానేరు తక్కువ రోజుల్లో గరిష్ఠస్థాయికి నీటి నిల్వలు చేరే అవకాశం ఉంది. మానేరు వాగులో సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్ వద్ద నిర్మించిన చెక్‌డ్యాం 2021లో వరదలకు కొట్టుకుపోయింది. ఇటు మూలవాగుపై వరదవెల్లి సమీపంలో చెక్‌డ్యాం నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది.

జిల్లా మెట్టప్రాంతం కావడంతో ఏడాది పొడవునా భూగర్భ జలమట్టాలు నిలకడగా ఉండాలి. దీనికి ఇసుక నిల్వలను పరిరక్షించాల్సిన అవసరం ఉంది. దాంతోపాటు జలాశయంలోకి వరద ద్వారా పైనుంచి వస్తున్న ఇసుక, మట్టి వెళ్లకుండా నిరోధించడం కూడా ప్రధానమే. దీనికి జలాశయం వెనక జలాల ప్రాంతంలో చెక్‌డ్యాంల నిర్మాణం ఆవశ్యకతపై గతంలోనే నీటిపారుదలశాఖ ప్రతిపాదనలు రూపొందించింది. కాగా ఎగువన చెక్‌డ్యాం నిర్మాణం పూర్తయ్యాక ఇక్కడ నిర్మాణం చేపడతామని ప్రాధాన్యతను మార్చారు.

ప్రస్తుతానికి సమస్య లేదు

జలాశయానికి ప్రస్తుతం పూడిక సమస్య లేదు. జలాశయం వెనక ప్రాంతంలో రక్షణగా చెక్‌డ్యాంల నిర్మాణంపై గతంలో అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఎగువన రెండు వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణం చేపడితే వరదల ద్వారా వచ్చే పూడికకు చాలా వరకు అడ్డుకట్ట పడుతుంది.

# ఫోన్ పోయిందా.. ఖాతా ఖాళీనే



హైదరాబాద్: 'నగరానికి చెందిన చైతన్య ఫోన్ పోగొట్టుకున్నాడు. పాత ఫోన్ కదా అని పట్టించుకోలేదు. మరుసటిరోజు కొత్త ఫోన్ కొని పాత నంబరుతోనే సిమ్‌కార్డు వేశాడు. డిజిటల్ చెల్లింపుల యాప్‌లు యాక్టివేట్ చేసి బ్యాంకు ఖాతా తనిఖీ చేశాడు. ఖాతాలోని రూ.9 వేలు ఓ పెట్రోలు బంకు ఖాతాకు బదిలీ చేసినట్లు లావాదేవీ కనిపించడంతో అవాక్కయ్యాడు. ఆరా తీయగా ఫోన్ దొరికిన వ్యక్తి ఈ పనిచేసినట్లు తెలుసుకున్నాడు.'

చరవాణి పోగొట్టుకుంటున్న బాధితులకు కొత్త తలనొప్పి వచ్చిపడుతోంది. రూ.వేలు పెట్టి కొన్న ఫోన్ పోయిందని ఓ వైపు మదనపడుతుంటే ఇంకోవైపు బ్యాంకు ఖాతాల్లో దాచుకున్న సొమ్ము క్షణాల్లో మాయమవడం కలవరపెడుతోంది. ఫోన్‌పే, గూగుల్ పే, క్రెడిట్, డెబిట్‌కార్డు పిన్ నంబర్లు, ఆధార్ నంబర్లు, ఇతర డిజిటల్ చెల్లింపుల యాప్‌లు ప్రతి ఫోన్‌లోనూ ఉండటం ఫోన్ కొట్టేసిన నేరగాళ్లు యూపీఐ పిన్ మార్చేసి తేలిగ్గా డబ్బు బదిలీ చేసుకుంటున్నారు. ఫోన్ పోయిన వెంటనే ఎక్కువ మంది యాప్ ఐడీలు, బ్యాంకు ఖాతాలను తాత్కాలికంగా బ్లాక్ చేయకపోవడం.. కొత్త ఫోన్ తీసుకునేవరకూ పాత సిమ్‌కార్డు బ్లాక్ చేయకుండా వేచి చూడటం వంటి చిన్న పొరపాట్లు నేరగాళ్లకు అవకాశంగా మారుతున్నాయి. ఇటీవలికాలంలో సైబర్ క్రైమ్ పోలీసులకు ఈ తరహా ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి.

యూపీఐతోనే మాయ: రహస్యంగా ఉంచాల్సిన యూపీఐ రహస్య పిన్‌ను కాంటాక్టు జాబితాలో సేవ్ చేయడం, ఫోన్ పోయిన వెంటనే సిమ్, బ్యాంకు ఖాతాలు బ్లాక్ చేయకపోవడంతో బ్యాంకు ఖాతాల్లో డబ్బు పోవడానికి ప్రధాన కారణమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఫోన్ పోగొట్టుకున్నా, చోరీ అయిన సందర్భాల్లో బాగా ఖరీదైన కొన్ని ఫోన్లు మినహా సాధారణ ఫోన్లు అన్‌లాక్ చేయడం తేలికే. జగదీశ్ మార్కెట్ లాంటి చోట్ల కొందరు సెల్‌ఫోన్ దుకాణదారులు అన్‌లాక్ చేసి.. కొత్త సెక్యూరిటీ కోడ్‌లు పెట్టడం వంటివి క్షణాల్లో చేసేస్తారు. ఆ తర్వాత నేరగాళ్లు ఫోన్‌లోని యూపీఐ యాప్‌లను డిలీట్ చేస్తారు. సిమ్‌కార్డు ఫోన్‌లోనే ఉండటంతో మళ్లీ యూపీఐ యాప్‌లు డౌన్‌లోడ్ చేసి ఈ డబ్బుతో ఖరీదైన వస్తువులు కొనుగోలు చేయడం లేదా.. ఇతరులకు డబ్బు బదిలీ చేసి నగదు తీసుకోవడం వంటివి ఎక్కువగా నమోదవుతున్నాయి. కొత్త ఫోన్ కొని బ్యాంకు ఖాతాలు తనిఖీ చేసినప్పుడు ఈ తతంగం ఎక్కువగా బయటపడుతున్నాయి.

అప్రమత్తత అవసరం

పాత, కొత్త ఫోన్ ఏదైనా పోగొట్టుకున్నా,చోరీ అయినా ఆలస్యం చేయకుండా బ్యాంకు ఖాతాను తాత్కాలికంగా బ్లాక్ చేయించాలి.

గూగుల్ పే, ఫోన్‌పే, ఇతర డిజిటల్ చెల్లింపుల యాప్‌లను బ్లాక్ చేయాలి

బ్యాంకు ఖాతా రహస్య పిన్‌లు కాంటాక్టు జాబితాలో సేవ్ చేసుకోకూడదు.

ఆధార్‌కార్డు నంబర్లు పెట్టడం ప్రమాదకరమే.

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి.

# తడబాటులో.. మనబడి



హైదరాబాద్: కొత్త పుస్తకాలు..దుస్తులు.. కొత్త జోష్‌తో పాఠశాలలకు వెళ్లనున్న చిన్నారులతో రాజధాని నగరంలో బుధవారం సందడి ప్రారంభం కానుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య.. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు లేకపోయినా తాత్కాలిక మరమ్మతులతో అరకొర సౌకర్యాలతో అధికారులు విద్యార్థులకు స్వాగతం చెబుతున్నారు. ఆరుబయలు లేని బడుల్లో, పాతబెంచీలతోనే విద్యార్థులు సర్దుకోవాలి. రంగులు వేసేందుకు, శౌచాలయాలు శుభ్రంగా ఉంచేందుకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రతి ప్రభుత్వ పాఠశాలకు రూ.40వేలు కేటాయించారు. రాజధాని నగరం, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 2,550 ప్రభుత్వ పాఠశాల్లో 3.50 లక్షల మంది విద్యారులు చదువుకుంటున్నారు. గతంలో 'మన బస్తీ..మన బడి' పేరుతో చేపట్టిన అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడడంతో వాటిని పక్కనపెట్టేశారు.

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు, విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేందుకు ప్రభుత్వం 14 అంశాలను గుర్తించింది. ఇందులో ప్రధానమైనవి ధారాళమైన గాలి, వెలుతురు వచ్చే తరగతి గదులు, సైన్స్‌ల్యాబ్, డ్యూయల్ డెస్కులు, విద్యారుల సంఖ్యకు సరిపడా శౌచాలయాలు, తాగునీటి సౌకర్యం, భద్రత కోసం ప్రహరీలు ఉండాలి.. ఇలాంటి పాఠశాలలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కొన్ని మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉండాలన్న తలంపుతో రాజ్‌భవన్ పాఠశాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని 40శాతం బడుల్లో సరైన బల్లలు లేవు. హైదరాబాద్ జిల్లాలో 159 పాఠశాలలకు సొంత భవనాలు లేవు. కొన్నింటికి తాగునీటి సౌకర్యం లేకపోతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేయూత అందించే లక్ష్యంతో కొందరు పూర్వ విద్యార్థులు, కొన్ని ఐటీ సంస్థలు మూడు జిల్లాల్లోని పలు బడుల్లో వసతుల కల్పనలో సహరిస్తున్నాయి. డిజిటల్ క్లాసులు, ప్రయోగశాలలకు అవసరమైన సహకారం అందిస్తున్నాయి.

విద్యాహక్కు చట్టం.. కాగితాలకే పరిమితం

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి 35 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. మూడు జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. పాతబస్తీ, సికింద్రాబాద్, ముషీరాబాద్, శేరిలింగంపల్లి, గోల్కొండ, రాజేంద్రనగర్, చేవెళ్ల, కీసర, ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట మండలాల్లో ఒక్క ఉపాధ్యాయుడే బోధిస్తున్నారు. వాలంటీర్లను నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినా జీతాలు సక్రమంగా రావడం లేదని కొందరే చేరుతున్నారు.

శిథిలావస్థలో పాఠశాల గోడ.. ఏదీ మరమ్మతుల జాడ ?

రెజిమెంటల్ బజార్ నెంబర్‌వన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇది. కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఈ పాఠశాల ప్రహరీ, పైకప్పు భాగం శిథిలావస్థకు చేరింది. గోడల నుంచి చెట్ల ఊడలు బయటికొస్తున్నాయి. అయినా మరమ్మతులు చేపట్టలేదు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో తడిసి ఎప్పుడు కూలుతుందో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అంధకారంలో స్మార్ట్ రోడ్లు

కరీంనగర్ : కరీంనగర్ ప్రధాన, అంతర్గత రహదారులను అందంగా తీర్చిదిద్దారు. రోడ్లు, డ్రైనేజీలు, నడకదారులు, మొక్కలు నాటి, రెయిలింగ్ ఏర్పాటు చేశారు. రహదారులకు ఇరువైపులా కొత్త స్తంభాలు వేసి వీధిదీపాలు బిగించారు. వెలుగులు విరజిమ్మాల్సిన ఆ ప్రాంతాలు చీకటిగా మారాయి. గత ఆరు నెలలుగా ఇలాగే ఉండగా అధికారులు సైతం పట్టనట్లుగా ఉంటున్నారు. సాంకేతిక కారణాలతో దాటేస్తుండగా ఆయా ప్రాంతవాసులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. నగరవ్యాప్తంగా సుమారు 5 వేల స్మార్ట్ లైట్లు బిగించారు. వీటిలో సగం విద్యుత్తు సరఫరా లేక నిలిపివేశారు.

నియంత్రికల పేరుతో ఆర్థిక భారం

వీధిదీపాలు ఏర్పాటు చేసుకోవడానికి నగరపాలక సంస్థ 200 మీటర్లకు డిపాజిట్ చెల్లించింది. ఒక్కో మీటర్ మూడు ఫేస్ విద్యుత్తు సరఫరా కల్పించారు. ఇక్కడి వరకు బాగానే ఉండగా విద్యుత్తు శాఖ కొత్త తిరకాసు పెట్టింది. ఆ శాఖనే విద్యుత్తు సామర్థ్యం మేరకు నియంత్రికలు వేసుకోవాల్సి ఉండగా, వాటికి డిపాజిట్ కట్టాలని డిమాండ్ చేస్తుండటంతో బల్దియాపై ఆర్థిక భారం పడుతోంది. హౌసింగ్‌బోర్డుకాలనీలో ఆరు నెలల కిందట స్మార్ట్ స్తంభాలకు లైట్లు బిగించారు. వీటికి 3 ఫేస్ 11 మీటర్లు అవసరం కాగా వీటిని పలు చోట్ల బిగించాల్సి ఉంది. దానికి విద్యుత్తు శాఖ అధికారులు మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పడంతో నగరపాలిక వెనక్కి తగ్గింది. ఆ వీధిదీపాలు వెలగకుండా తుప్పు పడుతున్నాయి.

అంచనాల్లోని పనులేవీ?

వీధిదీపాలకు అంతరాయం లేకుండా విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. స్తంభాలు వేసిన స్మార్ట్‌సిటీ గుత్తేదారు కొన్ని పనులు చేసి పత్తా లేకుండాపోయారు. అంచనాల ప్రకారం రోడ్డు క్రాసింగ్ పనులు చేయాల్సి ఉండగా, అవి చేయకుండా వదిలేశారు. అలుగునూర్ చౌరస్తా, పంచాయతీ కార్యాలయం, ఈనాడు కార్యాలయం, చేపల కాలనీ, హనుమాన్ టెంపుల్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు, వెంకటేశ్వర కమాన్, ఎన్టీఆర్ చౌరస్తా, బద్దం ఎల్లారెడ్డి కూడలి, బైపాసు హోండా షోరూం, ఆటోనగర్, ఆదర్శ ఆటో షోరూం, తీగల వంతెన చౌరస్తా, రిలయన్స్ బంకు, బొమ్మకల్ రోడ్లు, రేకుర్తిలోని ఈద్గా, లయోలా, కొత్తవాడ, కంటి ఆసుపత్రి, ఆంజనేయ టెంపుల్, యూనివర్సిటీ,



చింతకుంట పోలీసుస్టేషన్, సామిల్, రాజీవ్‌గృహ కల్ప, గాంధీనగర్, మంకమ్మతోట, సప్తగిరికాలనీ, గౌతమినగర్, ఉజ్వల పార్కు, ఫ్లైఓవర్ సెంట్రల్ లైట్లు, రోప్ హైమాస్ట్ లైట్లు, ఫిల్టర్‌బెడ్ వైపు తదితర ప్రాంతాల్లో రోడ్డు క్రాసింగ్ చేయాల్సి ఉంది.

రాత్రి పూట రాకపోకలకు అవస్థలు

నగరంలో ఆకర్షణీయ రహదారులు చీకటిగా మారాయి. విద్యానగర్ నుంచి మల్కాపూర్ రహదారి వైపు రెండు వైపులా లైట్లు వెలగాల్సి ఉండగా ఒక వైపు మాత్రమే వెలుగుతున్నాయి. కొన్ని చోట్ల మొత్తమే రావడం లేదు. హౌసింగ్‌బోర్డుకాలనీ, పోచమ్మవాడ, గాంధీరోడ్డు, కశ్మీర్‌గడ్డ, సప్తగిరికాలనీ, అశోక్‌నగర్, భగత్‌నగర్ అంతర్గత వీధులతో పాటు సిరిసిల్ల, రామగుండం బైపాసు రోడ్లు, ఎన్టీఆర్ విగ్రహం, రేకుర్తి, కంటి ఆసుపత్రి తదితర ప్రాంతాలు చీకటిగా ఉంటున్నాయి.

గుత్తేదారుకు నోటీసు ఇస్తాం

వీధిదీపాల పెండింగ్ పనులు చేయని గుత్తేదారుకు ఇప్పటికే నోటీసు ఇచ్చాం. తుది నోటీసు కూడా ఇస్తాం. ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్ల ఏర్పాటుకు అంచనాలు రూపొందించాం. ఆర్.యాదగిరి, ఈఈ, కరీంనగర్ నగరపాలిక

# అభివృద్ధికి లింకు

హైదరాబాద్: దూర ప్రాంతాలను దగ్గర చేస్తూ.. నగరాభివృద్ధిని అన్ని దిక్కులా విస్తరించడమే లక్ష్యంగా చేపట్టిన లింకు రోడ్ల నిర్మాణం విజయవంతంగా సాగుతోంది. ఏడాది కిందటే మొదటి దశ పనులు పూర్తవగా.. ప్రస్తుతం రెండో దశ పనులు కొనసాగుతున్నాయి. నిధుల సమస్యతో పనుల్లో వేగం నెమ్మదించినప్పటికీ పురోగతి కొనసాగుతోంది. తాజాగా జూబ్లీహిల్స్ రోడ్డు నం.5ను బంజారాహిల్స్ రోడ్డు నం.2తో కలిపే కీలకమైన రహదారి నిర్మాణం పూర్తి చేసుకుంది. భౌగోళిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ ఇంజినీర్లు భారీ కొండను తొలగించి ప్రధాన నగరంలో అభివృద్ధి మార్గాన్ని నిర్మించారని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




ఊపిరి పీల్చుకుంటున్న బస్తీలు : యూసఫ్‌గూడ, శ్రీనగర్‌కాలనీ చుట్టుపక్కలున్న వందకుపైగా కాలనీలకు భారీ ఉపశమనం కల్పిస్తూ యూసఫ్‌గూడ చెక్‌పోస్టు రోడ్డు (జూబ్లీహిల్స్ రోడ్డు నం.5), కేబీఆర్ పార్కు రోడ్డు (బంజారాహిల్స్ రోడ్డు నం.2)తో అనుసంధానం చేస్తూ రోడ్డు నిర్మాణమైంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే యూసఫ్‌గూడ, జూబ్లీహిల్స్ రోడ్డు నం.1, రోడ్డు నం.5లో రద్దీ తగ్గనుంది. ఇందిరానగర్, జవహర్‌నగర్, కమలాపురికాలనీ, శ్రీనగర్‌కాలనీ ప్రజలు పంజాగుట్ట, క్యాంప్ ఆఫీసు, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డు, బంజారాహిల్స్ రోడ్డు నం.10, 14, 12, 3, 1 రోడ్లను సులువుగా చేరుకోవచ్చు.మరిన్ని పురోగతిలో..లింకు రోడ్ల అభివృద్ధి మొదటి దశ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. రూ.323 కోట్లతో 25 రోడ్లను 25.2 కి.మీ పొడవున హెచ్ఆర్‌డీసీఎల్ అభివృద్ధి చేసింది.

రెండో దశలో భాగంగా రూ.185.25 కోట్లతో 11 రోడ్లను అభివృద్ధి చేసేందుకు చేపట్టిన పనులు తుది దశలో ఉన్నాయి. ఎన్నికలు పూర్తవడంతో ప్రభుత్వం హెచ్ఆర్‌డీసీఎల్‌కు ఆర్థిక తోడ్పాటు అందించే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

మూసారంబాగ్ అలీకేఫ్ చౌరస్తా నుంచి నాగోల్ మెట్రోస్టేషన్ వరకు రోడ్డును 100 అడుగుల మేర అభివృద్ధి చేస్తూ రూ.20 కోట్లతో చేపట్టిన లింకు రోడ్డు పనులు తుది దశలో ఉన్నాయి. ల్యాంకోహిల్స్ కూడలి, పుప్పాలగూడ, నార్సింగి, రాజేంద్రనగర్ సన్‌సిటీ, అల్కాపురికాలనీ, నెక్నాంపూర్ ప్రాం తాల్లో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి.

# తీరనున్న వలసదారుల పరేషాన్

హైదరాబాద్ : రాజధానిలో వలసదారుల(మైగ్రేషన్) రేషన్ దరఖాస్తుల వడపోత ప్రక్రియ మొదలైంది. ఉపాధి కోసం వలస వచ్చినవారంతా కొత్తకార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్లు, తదితరాలపై వీరంతా జీహెచ్ఎంసీలో 2020లో దరఖాస్తు చేసుకున్నారు. వాటిని తాజాగా పరిశీలించి అర్హులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ మేరకు ఇంటింటి సర్వే చేయాలంటూ పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారులను ఆదేశించింది. దీంతో మూడు జిల్లాల అధికారులు పరిశీలన చేపట్టారు.భారీగా అర్హులు..: కొత్త రేషన్ కార్డులపై అర్హుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. త్వరలో కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీపై ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన




రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2014 నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీ చేయకపోవడంతో అర్హుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ మేరకు ప్రజాపాలనలో లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక రేషన్ కార్డుల మ్యుటేషన్లు, కొత్త కార్డుల జారీపై గత ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడంతో ఆ అంశం పెండింగ్‌లో ఉంది. గ్రేటర్‌లో సుమారు 2లక్షల మంది కొత్త పేర్ల నమోదు, చిరునామాలో మార్పులు, తప్పుడు వివరాల సవరణ తదితరాలపై దరఖాస్తు చేసుకున్నారు. వాటిల్లో 10శాతం తిరస్కరించగా...30శాతం దరఖాస్తుల ప్రక్రియ మాత్రమే పూర్తయ్యింది. 60శాతం పెండింగ్‌లోనే ఉన్నాయి.

# ఎత్తిపోతలపై పట్టింపేదీ?

మల్లాపూర్ : రెండు వేల ఎకరాల బీడు భూములను సస్యశ్యామలం చేయాలన్న తలంపుతో మల్లాపూర్ మండలం ఒబులాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సోమేశ్వర ఎత్తిపోతల పథకం అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేని కారణంగా నిరుపయోగంగా మారింది. ఒబులాపూర్ గ్రామ శివారులో గోదావరి నదిపై 1991లో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు. ప్రారంభంలో నాలుగు సంవత్సరాల పాటు సాగునీటిని అందించారు. అనంతరం విద్యుత్తు బకాయిలు భారీగా పేరుకుపోవడంతో పథకం కాస్తా మరుగున పడింది. ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడంతో నీటిని ఎత్తిపోసే విద్యుత్తు మోటార్లు చెడిపోవడం రైతుల పాలిట శాపంగా మారింది.

మల్లాపూర్ మండలంలోని ఒబులాపూర్, సంగెం, శ్రీరాంపూర్ గ్రామాల్లోని బీడు భూములకు ఎస్సారెస్పీ కాలువల నుంచి సాగునీరు అందని పరిస్థితులు నెలకొనడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ఒబులాపూర్ శివారులోని గోదావరిపై అప్పట్లో అధికారులు సోమేశ్వర ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు. విద్యుత్తు బిల్లులను చెల్లించకపోవడంతో పథకం మూతపడింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పథకం బిల్లులను ప్రభుత్వం చెల్లించడంతో పాటు మోటార్లు, పరికరాలకు మరమ్మతు చేయించడంతో తిరిగి ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. మూడు సంవత్సరాల అనంతరం పథకాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మరుగున పడింది. గోదావరికి సమీపంలో ఉన్న రైతులు కొంతమంది నదిలో మోటార్లు ఏర్పాటు చేసుకుని కొంతమేర వ్యవసాయం చేసుకుంటుండగా, నదికి దూరంగా ఉన్న భూములు ఏళ్ల తరబడి నిరుపయోగంగానే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన ప్రభుత్వానికి రైతులు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.




# ఒక్కరోజులో 97 శాతం పింఛన్ల పంపిణీ సంతృప్తిని ఇచ్చింది

అమరావతి: ఒక్కరోజులో 97 శాతం పింఛన్ల పంపిణీ సంతృప్తిని ఇచ్చిందని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. 1వ తేదీనే ఇంటి వద్ద రూ. 2737 కోట్లతో 64 లక్షల మందికి పెంచిన పింఛన్ల పంపిణీ ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క రోజులో రికార్డు స్థాయిలో 97.54 శాతం పింఛన్లు అందించామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్దిదారుల ఆర్థిక భద్రత మా బాధ్యత అని చంద్రబాబు పేర్కొన్నారు. పెరిగిన పింఛను ఆ పేదల జీవితాలకు భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయిన ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు అందరికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు అంటే.. ప్రభుత్వంలో భాగమని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజలకు ఏ మంచి చెయ్యాలన్నా వారే కీలకమన్నారు. అలాంటి వర్గానికి కూడా 1వ తేదీనే జీతాలు అందజేశామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ చెల్లించామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.... అనేక సమస్యలు ఉన్నా రూ. 5300 కోట్లు విడుదల చేసి వారికి దక్కాల్సిన జీతం 1తేదీనే చెల్లించామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణ కార్యక్రమంలో ఉద్యోగులు, అధికారుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉద్యోగులతో పని చేయించుకోవడమే కాదు వారి సంక్షేమం చూసే, గౌరవం ఇచ్చే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పేర్కొన్నారు. కలిసి కష్టపడదామన్నారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చేందుకు అందరూ ముందుకు రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ ఒక్క రోజులోనే దాదాపుగా పూర్తి చేసి వైసీపీకి నోట మాట లేకుండా చేసింది ఏపీ ప్రభుత్వం. సచివాలయ ఉద్యోగులు రెండో నెలలో కూడా పింఛన్ల పంపిణీని సమర్థంగా చేపట్టి సామాజిక పెన్షన్‌దారుల మన్ననలు పొందారు. మొదటి రోజు 98 శాతం పూర్తి చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. 64 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.2737 కోట్లు అందించారు.

వలంటీర్లు పంపిణీ చేస్తే తప్ప ఈ పంపిణీ సజావుగా సాగదన్న వైసీపీ ప్రభుత్వ వ్యాఖ్యల్లో వాస్తవం లేదని సచివాలయ ఉద్యోగులు నిరూపించారు. పింఛన్ల పంపిణీపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పాలన ప్రారంభమయ్యాక పెంచిన సామాజిక పించన్లను రెండో నెలలోనూ విజయవంతంగా లబ్ధిదారులకు ఇంటి దగ్గరే పంపిణీ చేశామని అన్నారు. గురువారం ఉదయం నుంచి ఇంటింటికి వెళ్లి అందించేలా సీఎం చంద్రబాబు రూపొందించిన కార్యక్రమం ప్రజలకు చేరువైందన్నారు. అందరూ హర్షించేలా పించన్ల పంపిణీ కార్యక్రమాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు.


# శ్రీశైలం జలాశయం 10 గేట్లు 18 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటి విడుదల



నంద్యాల : శ్రీశైలం జలాశయం 10 గేట్లను 18 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం ఇన్ ఫ్లో : 4,65,261 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో : 4,91,602 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం : 883.80 అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ : 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం : 208.7210 టీఎంసీలకు చేరుకుంది. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. శ్రీశైలం డ్యాం దిగువన వరదనీటలో వ్యక్తి గల్లంతు అయిన ఘటన కలకలం రేపుతోంది. శ్రీశైలం జలాశయం లింగలగట్టు పెద్ద బ్రిడ్జ్ కింద స్నానానికి దిగి వరద నీటిలో అందరూ చూస్తుండగానే నీటిలో కొట్టుకుపోయి వ్యక్తి గల్లంతు అయ్యాడు. అతను నల్లగొండ జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన చొప్పరి యాదయ్య (50)గా గుర్తించారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనార్థం స్నేహితులతో కలిసి యాదయ్య వచ్చాడు. యాదయ్య కోసం పోలీసులు గాలిస్తున్నారు. ధవలేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఒకటో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకోవడం జరిగింది. గోదావరి నీటిమట్టం11.50.అడుగులకు తగ్గింది. 175 గేట్లను అధికారులు పూర్తిగా ఎత్తివేసి 9.52 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. 14 రోజుల తర్వాత లంక గ్రామాలకు వరద ప్రవాహం తగ్గింది. పునరావాస కేంద్రాల నుంచి వరద బాధితులు ఇళ్లకు చేరుకుంటున్నారు. వరద ప్రవాహంలో మునిగిపోయి ఉద్యాన, కాయగూరలు పంటలు కుళ్లిపోయాయి. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను అధికారులు ప్రభుత్వానికి పంపారు. పోలవరం ప్రాజెక్టు వద్ద ప్రస్తుత గోదావరి నీటిమట్టం స్పిల్ వే ఎగువన 32. 205 మీటర్లుగా ఉంది. స్పిల్ వే దిగువన 23.950 మీటర్లు నీటిమట్టం నమోదు అయ్యింది. 48 రేడియల్ గేట్ల ద్వారా 9,00,372 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ఏలూరు జిల్లా.. తమ్మిలేరు రిజర్వాయర్‌కు వరద నీరు వచ్చి చేరుతోంది. ఇన్ ఫ్లో 515 క్యూసెక్కులు కాగా... అవుట్ ఫ్లో 1048 క్యూసెక్కులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటిమట్టం: 355 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం: 349.62 అడుగులకు చేరుకుంది. ప్రస్తుత నీటి నిల్వ:. 2.030 టీఎంసీలు కాగా.. పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం: 3 టీఎంసీలకు చేరుకుంది.

# వైకాపా హయాంలో ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీంలో విచారణ

దిల్లీ: వైకాపా హయాంలో ఏపీలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ అంశంపై తాజా నివేదికలతో ఏపీ ప్రభుత్వం, కేంద్ర అటవీ, పర్యావరణశాఖ అఫిడవిట్లు దాఖలు చేశాయి. అనంతరం సుప్రీంకోర్టు విచారణను ఆగస్టు 31కి వాయిదా వేసింది. ఇప్పటికే 8 జిల్లాల్లో తనిఖీలు జరిపామని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ అఫిడవిట్‌లో పేర్కొంది. తనిఖీల్లో తేలిన విషయాలన్నీ కోర్టు ముందు ఉంచామని అదనపు సొలిసిటర్ జనరల్ తెలిపారు. ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన జేపీ వెంచర్స్‌ను వదిలిపెట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.






గన్నవరం: వైసీపీ సీనియర్ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు అరెస్ట్ చేశారు. గన్నవరం దగ్గరలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. గన్నవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై దాడి ఘటనలో ఆయనను అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి గన్నవరం వస్తుండగా వాహనాన్ని అనుసరించి అదుపులోకి తీసుకున్నారు. వంశీ ఇంటికి సమీపంలోనే పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి వేర్వేరు కార్లలో గన్నవరం వస్తున్నట్టుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆయనను పోలీసులు ట్రాక్ చేశారు. వంశీ వేరే మొబైల్ నంబర్ ఉపయోగిస్తున్నాడని పోలీసులకు తెలిసిపోయింది. దీంతో వంశీ వాహనాన్ని పోలీసులు గమనించారు. వాహనాన్ని అనుసరించి ఇంటికి సమీపంలోనే అరెస్ట్ చేశారు. కాగా గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో వల్లభనేని వంశీ ఏ71గా ఉన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు 21 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిలో చాలా మంది దాడికి ప్రోద్బలం ఇచ్చింది వల్లభనేని వంశీయేనని వాంగ్మూలం ఇచ్చారు. దీంతో వంశీని ఈ కేసులో ఏ1గా మార్చాలని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయనని అరెస్ట్ చేశారు.



# పింగళి వెంకయ్య స్ఫురణకు వస్తూనే ఉంటారు...

అమరావతి, ఆగస్టు 2: భారత జాతీయ జెండా రూపకర్త, తెలుగు జాతి ముద్దుబిడ్డ పింగళి వెంకయ్య జయంతి నేడు. ఈ సందర్భంగా ఆ మహినీయుడిని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్మరించుకున్నారు. పింగళి వెంకయ్య అందించిన స్ఫూర్తిని జాతి మరువదన్నారు. ఈ రోజు పింగళి వెంకయ్య జయంతి అని... ఆ మహనీయునికి మనస్ఫూర్తిగా అంజలి ఘటిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో మన దేశానికి ఒక కేతనం ఉండాలనే తపనతో వెంకయ్య మువ్వన్నెలతో పతాకాన్ని తీర్చిదిద్దారన్నారు. ఆ జెండా నాడు, నేడు, ఎన్నడూ మన కీర్తి కేతనంగా ఎగురుతూనే ఉంటుందన్నారు. ఆ జెండాకు సెల్యూట్ చేసిన ప్రతిసారి పింగళి వెంకయ్య స్ఫురణకు వస్తూనే ఉంటారని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కాగా... జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 1876, ఆగస్టు 2న కృష్ణా జిల్లా భట్ల పెనుమర్రులో జన్మించారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఎన్నో జాతీయ పతాకాలు వినియోగించారు. కానీ, పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని జాతీయ పతాకంగా గుర్తించారు. 1921 మార్చి 31 ఏప్రిల్ 1 వరకు విజయవాడలో మహాత్మాగాంధీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఈ జాతీయ పతాకాన్ని ఏకగ్రీవంగా నిర్ణయించారు.





## ఇంకానయం.. వర్షపు నీటికి చలాన్ వేయలేదు: దిల్లీ అధికారులపై హైకోర్టు ఫైర్

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని ఓ ఐఏఎస్ స్టడీ సెంటర్‌లోకి ఇటీవల వరదనీరు పోటెత్తి సివిల్స్‌కు శిక్షణ పొందుతున్న ముగ్గురు విద్యార్థులు మృతిచెందిన ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ కేసు దర్యాప్తులో పోలీసులు, మున్సిపల్ అధికారుల ప్రవర్తిస్తున్న తీరుపై దిల్లీ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కొన్ని సంస్థలు తాము చట్టానికి అతీతమన్నట్లుగా ప్రవర్తిస్తున్నాయని ఆగ్రహించింది. "ఆ ముగ్గురు విద్యార్థులు వరదనీటిలో ఎలా మునిగిపోయారో ఇప్పటికీ అర్థం కావట్లేదు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, నిబంధనలను ఉల్లంఘించి బేస్‌మెంట్‌లో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఆ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోతే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎందుకు కమిషనర్‌కు సమాచారం అందించలేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లుగా కన్పిస్తోంది" అని న్యాయస్థానం మండిపడింది. ఇక, ఈ కేసులో ఎస్‌యూవీ డ్రైవర్‌ను అరెస్టు చేయడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. "ఇంకా నయం.. ఘటన జరిగిన ప్రాంతంలో వాహనం నడిపినందుకు కారు డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లుగా.. బేస్‌మెంట్‌లోకి వరద వచ్చిందని చెప్పి వర్షపు నీటికి చలాన్ వేయలేదు" అంటూ దర్యాప్తు తీరుపై పెదవి విరించింది. జులై 27న సెంట్రల్ దిల్లీలోని ఓల్డ్ రాజేంద్రనగర్‌లో ఈ విషాదకర ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. భారీవర్షానికి భవనంలోని సెల్లార్‌లో నిర్వహిస్తున్న సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్ గ్రంథాలయంలోకి వరదనీరు చొచ్చుకుపోయింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. అయితే, ప్రమాదం సమయంలో కోచింగ్ సెంటర్ భవనం ముందు భారీగా చేరిన వరదనీటిలో నుంచి ఓ ఫోర్ వీలర్ వాహనం వేగంగా దూసుకుపోయిందని, బలంగా తాకిన నీటి అలల ధాటికి గేటు విరిగి వరదనీరు సెల్లార్‌లోకి ప్రవహించినట్లు ఓ వీడియో కథనం వెల్లడించింది. దీంతో సదరు వాహనం నడిపిన డ్రైవర్ మనుజ్ కథూరియాను పోలీసులు అరెస్టు చేయడం వివాదానికి దారితీసింది. ఈ కేసులో ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

# రైతులకు పగటిపూటే 9 గంటల నాణ్యమైన విద్యుత్ అందాలి

## సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యతనివ్వాలి - విద్యుత్ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి :-లి రాష్ట్ర రైతాంగానికి పగటిపూటే 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా ఆయా ఫీడర్ల సామర్థ్యాన్ని మెరుగు పరచడంతో పాటు ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. డిమాండుకు తగ్గ విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి వంటి పరిస్థితులను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో సీఎం విద్యుత్ శాఖపై శుక్రవారం సమీక్షించారు. రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాల్సి ఉందని, ఆ దిశగా ప్రణాళికలతో రావాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ రకాల సబ్సిడీలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, యూనిట్ విద్యుత్ తయారీకి అవుతున్న వ్యయం, లోటును భర్తీ చేసేందుకు ఇతర గ్రిడ్ల నుండి కొనుగోలు చేస్తున్నవిద్యుత్ కు అవుతున్న వ్యయం తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. అదే విధంగా థర్మల్, జల విద్యుత్, సోలార్, విండ్ వంటి విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు, త్వరలో అందుబాటులోకి రానున్న విద్యుత్ ప్రాజెక్టుల పరిస్థితులపైనా సమీక్షించారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ విధానంపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అంతకు ముందు రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి పరిస్థితులను సీఎంకు వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఇంధన శాఖామంత్రి గొట్టిపాటి రవి కుమార్, సీఎం కార్యదర్శి ఏ.వీ రాజమౌళి, ఏపీ జెన్.కో ఎండీ చక్రధర్ బాబు, ఏపీ ట్రాన్స్ కో జెఎండీకీర్తి, ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్, కెపిఎంజి ప్రతినిధి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే రైతులకు బిందు సేద్యం అందించండి...



అమరావతి, ఆగస్టు 2: రాష్ట్ర రైతుల కోసం వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు.

రైతులకు తక్షణమే రాయితీపై బిందు సేద్యం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో రాయితీపై బిందు సేద్యం అమలుపై అధికారులతో మంత్రి అచ్చెన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో తక్షణమే రిజిస్ట్రేషన్ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.1167 కోట్ల బకాయిలు పెట్టిందని తెలిపారు. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో బిందు సేద్యం నిర్వీర్యమైందన్నారు. దేశంలో ముందున్న రాష్ట్రాన్ని దేశంలోనే చివరి స్థానంలోకి జగన్ ప్రభుత్వం తీసుకెళ్లిందని విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా అందించే బిందు సేద్యం ఫండ్ కూడా జగన్ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదన్నారు. రైతుల పట్ల వైసీపీ ప్రభుత్వం తీవ్ర కక్ష పూరిత ధోరణి అవలంభించిందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం రైతులకు, రైతు శ్రేయస్సు కోసం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

# అవయవదానానికి అంగీకరిస్తూ మంత్రి సత్యకుమార్ సంతకం..

విజయవాడ: జీవన్ దాన్ పై అవగాహన కార్యక్రమంలోపాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే బోండా ఉమ పాల్గొన్నారు. ఇదే వేదిక పై అవయవదానానికి అంగీకరిస్తూ మంత్రి సత్యకుమార్ సంతకం చేశారు. అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులను సత్యకుమార్, బోండా ఉమ సత్కరించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ.. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నా... ప్రజల్లో మార్పు రాలేదన్నారు. మన రాష్ట్రం లో 260 మంది అవయవ దానంకోసం ముందుకు వచ్చారన్నారు. తెలంగాణలో ఎనిమిది వందల మంది ముందుకు వచ్చారన్నారు. 90 వేల మంది అవయవ దానం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. యేటా ఐదు లక్షల మంది అవయవాలు చెడిపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని సత్య కుమార్ అన్నారు. జాతీయ స్థాయిలో చాలా స్వల్పంగా ఈ అవయవ దానమ రిజిస్ట్రేషన్ లు ఉన్నాయన్నారు. కొంత మందికి మతాచారాలు అడ్డుగా వస్తున్నాయని అంటున్నారన్నారు. తీసుకునేందుకు లేని అభ్యంతరం ఇచ్చేందుకు లేదన్నారు. ఈ దేవుడు అయినా పరులకు మంచి చేయమనే చెబుతారన్నారు. డయాలసిస్ సెంటర్ల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కిడ్నీల మార్పిడి కోసం ప్రజలు చాలా మంది క్యూలో ఉన్నారన్నారు. అవయవ దానం వల్ల అంత్యక్రియలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ అంశాలను సీఎం చంద్రబాబు దృష్టి కి తీసుకెళతానని సత్య కుమార్ పేర్కొన్నారు. అవయవదానం చేసిన వారి అంత్యక్రియల్లో కలెక్టర్, ఎస్పీ పాల్గొని వీరవందనం చేసేలా మార్పులు తెస్తామన్నారు. ఆర్థికంగా కూడా ఆ కుటుంబానికి ఎంతో కొంత సాయం అందించాలని సత్యకుమార్ పేర్కొన్నారు. ఈ మార్పులపై సీఎం సానుకూలంగా స్పందిస్తారని భావిస్తున్నానన్నారు. అవయవదానంలో భాగస్వామ్యం అవుతున్న వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ఉన్న వారికి ధన్యవాదాలు తెలిపారు. ఇంకా సమాజంలో మార్పు రావాలి, ప్రజల్లో చైతన్యం కలిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సత్యకుమార్ పేర్కొన్నారు. వేల మందికి పునర్జన్మ కలిగించేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. తాను కూడా బాధ్యతగా అవయవదానానికి అంగీకరిస్తూ సంతకం చేశానన్నారు. తన కుటుంబ సభ్యులకు సైతం సమాచారం ఇచ్చానని సత్యకుమార్ తెలిపారు

# నంద్యాల జిల్లాలో ఘోరం.. మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

అమరావతి : ఏపీలోని నంద్యాల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది.

జిల్లాలోని చాగలమర్రి మండలం చిన్న వంగలి గ్రామంలో మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. దంపతులు గురుశేఖర్‌రెడ్డి(45), దస్తగిరమ్మ(38) , ఇద్దరు కుమార్తెలు పవిత్ర(16), గురులక్ష్మి(10) శిథిలాల కింద చిక్కుకుని మరణించారు. మృతదేహాలను గ్రామస్థుల వెలికితీశారు. కుటుంబంలో మొత్తం 5గురు సభ్యులుండగా దంపతుల రెండో కుమార్తె ప్రసన్న కడప జిల్లా ప్రొద్దుటూరు ఉషోదయ పాఠశాలలో చదువుకుంటుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇంటి మట్టి మిద్దె నీటితో నాని కూలి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు



నెలకొన్నాయి. పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.

## అతడితో రష్మిక ర్యాంప్‌వాక్ వైరల్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈసారి రష్మిక బాలీవుడ్ యంగ్ స్టార్ విక్కీ కౌశల్ తో కలిసి ర్యాంప్ వాక్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. వీరి జోడీ ర్యాంప్ వాక్ కి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం విక్కీ కౌశల్ తో కలిసి ఛావా అనే సినిమాలో ఈ అమ్మడు నటిస్తున్న విషయం తెల్సిందే. ఆ సినిమా ప్రమోషన్ లో భాగంగా ఢిల్లీలో జరిగిన ఇండియా కోచర్ వీక్ 2024 లో పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో విక్కీ కౌశల్ మరియు రష్మిక మందన్న చేసిన ర్యాంప్ వాక్ అందరి దృష్టిని ఆకర్షించింది. బాలీవుడ్ ప్రముఖ తారలు పాల్గొన్న ఇండియా కోచర్ వీక్ కార్యక్రమంలో రష్మిక మందన్న ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నడుము అందం చూపిస్తూ, క్లీ వేజ్ షో తో ఈ అమ్మడు చేసిన షోకి



నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. అద్భుతమైన ఔట్ ఫిట్ తో రష్మిక కన్నుల విందు చేసింది. విక్కీ కౌశల్ కూడా డిఫరెంట్ ఔట్ ఫిట్ తో రష్మిక మందన్న కి ఏమాత్రం తగ్గకుండా అమ్మాయిల మనసు దోచే విధంగా కనిపించాడు. మొత్తానికి వీరిద్దరు కూడా జంటగా కనిపించడం ద్వారా సోషల్ మీడియాలో వైరల్ అయ్యారు. ప్రస్తుతం రష్మిక మందన్న అరడజను సినిమాల్లో నటిస్తున్న విషయం తెల్సిందే. ముఖ్యంగా ఈ అమ్మడు చేస్తున్న పుష్ప 2 పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ ఏడాది డిసెంబర్ లో ఆ సినిమా విడుదల అవ్వబోతుంది. ఇక రెండు లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో కూడా ఈ అమ్మడు నటిస్తుంది. యానిమల్ సినిమా తర్వాత బాలీవుడ్ లో ఈ అమ్మడికి మంచి డిమాండ్ క్రియేట్ అయ్యింది. అందుకు తగ్గట్లుగానే ఈ అమ్మడు అక్కడ వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. అక్కడ మరో రెండు హిట్స్ పడితే బాలీవుడ్ కే పూర్తిగా ఈ అమ్మడు పరిమితం అయ్యే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## అటువంటి పాత్రలకే రెడీ అంటున్న దేవర బ్యూటీ..

అతిలోక సుందరి శ్రీదేవి కూతురుగా సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టిన జాన్వీ కపూర్ బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్గా కొనసాగుతోంది. ఎన్టీఆర్ నటిస్తున్న దేవర చిత్రంలో హీరోయిన్గా తెలుగు తెరకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సినిమా విడుదలకు ముందే మెగా పవర్ స్టార్ పక్కన మరొక సినిమాకి చాన్స్ కొట్టేసింది. తాజాగా ఆమె నటించిన 'ఉలఝ్'మూవీ ఆగస్టు రెండున ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో జాన్వీ తనకు నచ్చిన సినిమాల గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. తన జీవితంలో సవాలతో కూడిన పాత్రలకు ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ కుండ బద్దలు కొట్టి చెప్పేసింది.. అంతేకాదు ఆమె జీవితమంతా నటనకే అంకితం అంటూ తొలి సినిమా నుంచి ఇప్పటివరకు ఎన్నో విషయాలు నేర్చుకుంటూ అంచలంచలుగా ముందుకు వెళ్తున్నాను అని స్పష్టం చేసింది. అందరిలాగా గ్లామర్ తో కూడిన కమర్షియల్ సినిమాలు చేస్తోంది.. మరోపక్క లేడీ ఓరియంటెడ్ పెక్యులర్ మూవీస్



కి కూడా సిద్ధంగా ఉంది. కమర్షియల్ సినిమాలు ,గ్లామర్ షోలు అతి తక్కువ సమయంలో విజయాన్ని తీసుకువస్తాయి. కానీ రిస్క్ తో కూడిన పాత్రలు చేస్తేనే కదా మనం ఏంటో తెలుస్తుంది అంటుంది ఈ బ్యూటీ. 'రిస్క్ తో కూడిన పాత్రలో ఉన్న సినిమాలలో నా నటన చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోవాలి అని భావిస్తాను. అందుకే చిన్న సినిమాలనే ఎంచుకుంటున్నాను. ప్రతి సినిమాలో దర్శకుడు నా నుంచి ఏమి కోరుకుంటారో అది 100% ఇవ్వడానికి ప్రయత్నిస్తాను.. ఇప్పటివరకు నేను నా కెరీర్లో రెండు హైరిస్క్ సినిమాలను ఎంచుకున్నాను.. వాటిలో విడుదల కాబోతున్న 'ఉలఝ్' ఒకటి. ఈ మూవీ ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.'అని ఈ బ్యూటీ ఇంటర్వ్యూలో చెప్పింది. నిన్న మొన్నటి వరకు దేవర షూటింగ్లో చాలా బిజీగా ఉన్న జాన్వీ.. ప్రస్తుతం తన సరికొత్త మూవీ ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బాలీవుడ్ నుంచి దేశభక్తి చిత్రాలు విడుదలవుతూ ఉంటాయి. జాన్వీ నటించిన 'ఉలఝ్'మూవీ కూడా దేశభక్తి కథాంశం తో సాగుతుంది. ఇండియన్ ఫారెన్ సర్వీస్ నేపథ్యంలో సాగే ఒక థ్రిల్లర్ మూవీ గా ఇది ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ చిత్రంపై అంచనాలను బాగా పెంచింది.




# ఎన్టీఆర్ బామ్మర్దికి అసలు పరీక్ష!



జూనియర్ ఎన్టీఆర్ బామ్మర్ది నార్నె నితిన్ మ్యాడ్ సినిమాతో గత ఏడాది టాలీవుడ్ లోకి అడుగుపెట్టి సక్సెస్ అందుకున్నారు. అంతకంటే ముందే రెండు సినిమాలు స్టార్ట్ చేసినా అవి ఎందుకనో రిలీజ్ కాలేదు. మ్యాడ్ మూవీలో మరో ఇద్దరు టాలెంటెడ్ యాక్టర్స్ తో కలిసి నార్నె నితిన్ స్క్రీన్ షేర్ చేసుకున్నారు. సంగీత్ శోభన్ కామెడీతో మ్యాడ్ సినిమాకి మంచి మైలేజ్ దొరికింది. మూవీ కమర్షియల్ సక్సెస్ అయ్యింది. ఈ సినిమాలో నార్నె నితిన్ మెయిన్ లీడ్ చేసిన అతని కంటే సంగీత్ శోభన్ కి ఎక్కువ గుర్తింపు వచ్చింది. అయితే ఇప్పుడు గీతా ఆర్ట్స్ 2లో ఆయ్ సినిమాని నార్నె నితిన్ చేశారు. ఈ సినిమాలో ఆయన సోలో హీరోగా కనిపించబోతున్నాడు. ఇప్పటికే మూవీ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. ఆయ్ నుంచి వచ్చిన సాంగ్స్ అయితే ప్రేక్షకులకి బాగా కనెక్ట్ అయ్యాయి. అనిల్ కంచిపల్లి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నయన సారిక హీరోయిన్ గా చేస్తోంది. బన్నీ వాస్ ఈ చిత్రాన్ని నిర్మించారు. గోదావరి బ్యాక్ డ్రాప్ లో అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్ గా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. మొదటి సినిమా మ్యాడ్ మూవీ సక్సెస్ తో నార్నె నితిన్ కి కొంత ఫేమ్ వచ్చిన కూడా సోలోగా అతను ఆయ్ సినిమాతో ప్రూవ్ చేసుకోవాల్సిందే. ఆగష్టు 15న ఈ సినిమా రిలీజ్ అవుతోంది. అయితే అదే రోజు రామ్ డబుల్ ఇస్మార్ట్, రవితేజ మిస్టర్ బచ్చన్ సినిమాలు కూడా ప్రేక్షకులు ముందుకి రాబోతున్నాయి. ఈ రెండు సినిమాలపైన కూడా మంచి హైప్ ఉంది. రెండు మాస్ కమర్షియల్ చిత్రాల మధ్యలో చిన్న సినిమాగా ఆయ్ మూవీ రాబోతోంది. అయితే ఈ సినిమా సాంగ్స్ కి మంచి స్పందన రావడంతో మూవీ బాగుందనే టాక్ కూడా ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది. మరి సోలోగా నార్నె నితిన్ ఆయ్ సినిమాతో ఎలాంటి సక్సెస్ ని అందుకోగలడు అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. నిర్మాతగా బన్నీ వాస్ 18 పేజెస్, వినరో భాగ్యము విష్ణు కథ, అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ సినిమాలతో హ్యాట్రిక్ సక్సెస్ లు అందుకున్నారు. ఆయ్ సినిమా మీద కూడా బన్నీ వాస్ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నారు. ఈ సినిమాని దగ్గరుండి ప్రమోట్ చేస్తున్నాడు. ఈ సినిమా వర్క్ అవుట్ అయితే బన్నీ వాస్ ఖాతాలో మరో సక్సెస్ చేరుతుంది. బన్నీ వాస్ నిర్మాతగా గీతా ఆర్ట్స్ 2 నుంచి ఇప్పటి వరకు వచ్చిన సినిమాలలో మూడు సినిమాలు మాత్రం కమర్షియల్ గా ఫ్లాప్ అయ్యాయి. మిగిలినవన్నీ మంచి సక్సెస్ అందుకున్నాయి. మరి ఆయ్ మూవీ ఫలితం కూడా అతని గత సినిమాల రిజల్ట్ ని రిపీట్ చేస్తుందా అనేది చూడాలి.

# 16 ఏళ్ల తర్వాత ఫ్యాషన్ కి సీక్వెల్!




ప్రస్తుతం బాలీవుడ్ లో సీక్వెల్స్ ట్రెండ్ నడుస్తోంది. హిట్ సినిమాలకు స్టార్ మేకర్స్ అంతా సీక్వెల్స్ రూపొందించే పనిలో పడ్డారు. దీనిలో భాగంగా ఏకంగా 20..25 ఏళ్ల క్రితం నాటి హిట్ సినిమాల్ని సైతం తవ్వి తీస్తున్నారు. వాటికి సీక్వెల్ చేస్తే ఎలా ఉంటుంది? ఆలోచించి బాగుంటుందంటే ? ముందుకెళ్లిపోతున్నారు. ఇటీవలే 27 ఏళ్ల క్రితం హిట్ అయిన బార్డర్ సినిమాకి సీక్వెల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా 16 ఏళ్ల క్రితం నాటి ఫ్యాషన్ చిత్రానికి సీక్వెల్ అనౌన్స్ చేసారు. ప్రియాంక చోప్రా, కంగనా రనౌత్ ప్రధాన పాత్రల్లో మధురా బండర్కార్ తెరకెక్కించిన ఫ్యాషన్ 2008 రిలీజ్ అయి మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఒక వ్యక్తి ఫ్యాషన్ రంగంలో సూపర్ మోడల్ గా ఎదగాలంటే? దాని వెనుక కష్టాన్ని తెలియజేస్తూ తెరకెక్కించిన చిత్రమిది. ఉత్తమ నటి, ఉత్తమ సహాయనటిగా ఈ సినిమాకి జాతీయ అవార్డులు కూడా అందుకున్నారు పీసీ, కంగన. రోనీ స్క్రూవాలా ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ సినిమాకి సీక్వెల్ ప్రకటించి అభిమానుల్ని సర్ ప్రైజ్ చేసారు. ఈ కథకి కొనసాగింపు కథని మధుర బండార్కర్ సిద్ధం చేస్తున్నారు. నేటి జనరేషన్ లో మోడలింగ్ రంగం ఎలా ఉంది? ఇప్పుడెలాంటి మార్పులు చేసుకున్నాయి? వంటి అంశాల ఆధారంగా సీక్వెల్ కథని సిద్ధం చేస్తున్నారు. అయితే ఇందులో పీసీ, కంగన నటిస్తారా? కొత్త వాళ్లను తెరపైకి తెస్తారా? అన్నది చూడాలి. ఇందులో కొత్త వారికే అవకాశం ఉంటుంది. పీసీ, కంగనల వయసు కూడా పెరిగింది. వారిప్పుడు సూపర్ హీరోయిన్లగా ఎదిగారు. వాళ్లతో మళ్లీ మోడలింగ్ రోజుల్ని గుర్తి చేయడం అంటే రుచించే అవకాశం ఉండదు. నేటి జనరేషన్ భామల్ని తీసుకుని చేస్తేనే బాగుంటుంది అన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.

## నిహారిక మళ్లీ పెళ్లి? ఆమె రెస్పాన్స్ ఏంటంటే?


మెగా ఫ్యామిలీ నుంచి వచ్చిన ఏకైక హీరోయిన్ నిహారిక కొణిదెల.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే. యాంకర్ గా.. యాక్ట్రెస్ గా.. నిర్మాతగా టాలీవుడ్ లో పాపులర్ అయింది. తన టాలెంట్ ను ప్రూవ్ చేసుకుని సత్తా చాటుతోంది. ఇప్పుడు నిర్మాతగా ఫస్ట్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే.. కమిటీ కుర్రోళ్ళు మూవీ నిర్మించింది. త్వరలోనే ఈ చిత్రం రిలీజ్ కానుంది. అయితే నిహారిక పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే.. జొన్నలగడ్డ చైతన్యను పెళ్లి చేసుకుంది. కానీ కొన్నాళ్లకే పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకుంది. విడాకుల తర్వాత కాస్త సైలెంట్ అయిన మెగా డాటర్.. ఇప్పుడు మళ్లీ వర్క్ పై ఫోకస్ చేసి దూసుకుపోతోంది. నటనతోపాటు సినిమాలు, వెబ్ సిరీస్ నిర్మాణంలో బిజీగా ఉంటోంది. వాట్ ద ఫిష్ మూవీలో అష్టలక్ష్మి అనే పాత్ర పోషిస్తోంది. దీంతోపాటు తమిళ చిత్రంలో కూడా యాక్ట్ చేస్తోంది. ఇప్పుడు కమిటీ కుర్రోళ్ళు మూవీ ప్రమోషన్స్ లో భాగంగా బిజీగా గడుపుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో విడాకులు, మళ్లీ



ప్రేమ, పెళ్లిలాంటి అంశాలపై స్పందించింది నిహారిక. విడాకుల తర్వాత లైఫ్ మెరుగ్గానే ఉందా అని అడగ్గా.. ప్రస్తుతం తాను వర్క్ పై ఫుల్ ఫోకస్ చేసినట్లు తెలిపింది. యాక్టింగ్ తో పాటు ప్రొడక్షన్ పై తన దృష్టి అంతా ఉందని చెప్పింది. మళ్లీ ప్రేమ లేదా పెళ్లి కోసం అడగ్గా.. ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. తాను హ్యాపీగా ఉండాలని అనుకుంటున్నానని చెప్పింది నిహారిక. అది సింగిల్ గానా లేక ఎవరితో కమిట్ అయ్యాక అనేది సమయమే నిర్ణయిస్తుందని తెలిపింది. తాను దేనికోసం కూడా వెతికి మరీ వెళ్లనని పేర్కొంది. ఏది రాసి పెట్టి ఉంటే అదే జరుగుతుందని వెల్లడించింది. అయితే పేరెంట్స్ తనకు ఆ విషయంలో గౌరవిస్తారని తెలిపింది. స్వేచ్ఛ కూడా ఇచ్చారని అనింది. తల్లిదండ్రులు నాపై ప్రెషర్ పెట్టరని తెలిపింది. ప్రస్తుతం నిహారిక వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే ఇంతకుముందు కూడా నిహారిక ఓ పాడ్ కాస్ట్ లో విడాకుల అంశంపై స్పందించింది. విడాకుల విషయంలో చాలా బాధపడ్డానని తెలిపింది. ఆ బాధ తనకు మాత్రమే తెలుసని చెప్పింది. తనపై తానే దృష్టి సారించే స్టేజ్ లో ఉన్నానని పేర్కొంది. పేరెంట్స్ కు సపోర్ట్ గా ఉండాలనుకుంటునట్లు చెప్పింది. విడాకుల తర్వాత ఎంతో ఏడ్చానని తెలిపింది నిహారిక. ఇప్పటికైతే నేను సింగిలేనని క్లారిటీ ఇచ్చింది.

## స్వర్గం నుంచి దిగి వచ్చిన రాజకుమారి

పెళ్లి సందడి సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రీలీల. ఈ అమ్మడు మొదటి సినిమాతో నిరాశ పరిచిన కూడా ధమాకా సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ధమాకా తర్వాత ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయడం మొదలు పెట్టింది. శ్రీలీల హీరోయిన్ గా ఒకానొక సమయంలో ఏకంగా పది సినిమాలు ఏక కాలంలో చేసిన విషయం తెల్సిందే. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు నిరాశ పరిచినా కూడా శ్రీలీల



ధమాకా కంటిన్యూ అవుతూనే ఉంది. ప్రస్తుతం కూడా ఈ అమ్మడి చేతిలో మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. ఈ అమ్మడి ఫోటోలు సోషల్ మీడియాలో రెగ్యులర్ గా వైరల్ అవుతూ ఉన్నాయి. తాజాగా మరోసారి శ్రీలీల ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తాజాగా ఈ ఫోటోలను షేర్ చేసిన ఫ్యాన్స్ మా శ్రీలీల బంగారం అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తూ తెగ వైరల్ చేస్తున్నారు. స్వర్గం నుంచి దిగి వచ్చిన రాజకుమారి మా శ్రీలీల అంటూ ఈ ఫోటోలకు నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. నిజంగానే శ్రీలీల ఈ ఔట్ ఫిట్ లో చాలా అందంగా ఉందని, స్వర్గం నుంచి దిగి వచ్చింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయిలో అందాల ఆరబోత చేస్తుంది కనుకే ఇండస్ట్రీలో బిజీ బిజీగా ఉందనే కామెంట్స్ వస్తున్నాయి.



# అసెంబ్లీలో కేసీఆర్ లేకపోవడంతో కిక్కురావట్లేదు..!!

హైదరాబాద్: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అసెంబ్లీలో లేకపోవడం వల్ల తమకు కిక్కు రావడం లేదని కాంగ్రెస్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం నాడు మీడియాతో ఆయన చిట్ చాట్ చేశారు. "కేసీఆర్ సభకు వస్తే మజా ఉంటుంది. కరెంట్‌పై డిస్కషన్‌లో కేసీఆర్ ఉండి ఉంటే ఇంకా బాగా జరిగేది. ఆయన ఓడిపోయిన ఇంకా జాతిపిత అనుకుంటున్నాడు. కేసీఆర్ ఊహల్లో బతుకుతుండు. పార్టీ మారితే రాజీనామా చేసి వెళ్లాలి. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఎలా వెళ్తారు. మహిళ అని క్లయిమ్ చేస్తున్నప్పుడు గౌరవంగా ఉండాలి కదా. పార్టీ మారి ఉండాల్సింది కాదు. హౌస్‌లో సస్పెన్షన్‌లు చేయకపోవడం మా ప్లాన్. ఎల్ఓపీగా కేసీఆర్ సభకు రాకపోవడంతో ఆ పార్టీ నేతల పరిస్థితి తల్లి లేని పిల్లలుగా అనిపిస్తుంది. మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ ఇద్దరిలో ఎవరికి ఎల్ఓపీ ఇచ్చిన బీఆర్ఎస్ ఆగం అవుతది. హరీష్‌రావు మంచి అనుభవం ఉన్న నేత కానీ ఆయనకు ఇవ్వరు. కేటీఆర్‌కు అవగాహన లేదు" అని రాజగోపాల్ రెడ్డి సంచలన విమర్శలు చేశారు.

**క్రీడాకారులకు శుభవార్త :** మరోవైపు తెలంగాణలో క్రీడాకారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తామని అసెంబ్లీ వేదికగా తెలియజేశారు. శుక్రవారం శాసనసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలని బడ్జెట్‌లో రూ.321 కోట్లు కేటాయించిందని తెలిపారు. చదువులోనే కాదు క్రీడల్లోరాణిస్తే కూడా ఉన్నత ఉద్యోగం వస్తుందని, కుటుంబ గౌరవం పెరుగుతుందన్నారు. ఇది నిరూపించేందుకే నిఖత్ జరీన్‌కు ఆర్థిక సాయంతో పాటు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ఇల్లు కట్టుకునేందుకు 600 గజాల ప్లాట్ ఇచ్చామని, అలాగే ఇంటర్ చదవిన సిరాజ్‌కు ఎడ్యుకేషన్‌కు ఎగ్సెమ్షన్ ఇచ్చి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని చెప్పారు. గ్రాడ్యుయేట్ అయిన నిఖత్‌కు కూడా గ్రూప్ - 1 ఉద్యోగం ఇచ్చామని తెలిపారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ తీసుకువస్తామన్నారు.

**బీసీసీఐతో చర్చలు..** వివిధ రాష్ట్రాల పాలసీలు అధ్యయనం చేసి బెస్ట్ పాలసీని తీసుకొస్తామని సీఎం స్పష్టం చేశారు. హర్యానాలో అత్యధికంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో స్పోర్ట్స్ పాలసీని సభలో ప్రవేశపెడతామన్నారు. మండల కేంద్రాల్లో భూములు అందుబాటులో ఉంటే స్టేడియం నిర్మించడానికి ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని వెల్లడించారు. బ్యాగరి కంచెలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు బీసీసీఐతో ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని.. వారు కూడా సానుకూలంగా స్పందించారని చెప్పారు. రాబోయే కొద్దిరోజుల్లోనే ఇందుకు భూమిని కేటాయిస్తామన్నారు. స్పోర్ట్స్ విషయంలో నిధుల కేటాయింపుతో పాటు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళతామని చెప్పుకొచ్చారు.

**స్పోర్ట్స్ పాలసీ కోసం సలహాలు ఇవ్వండి..** వ్యసనాల నుంచి యువతను బయటకు తీసుకువచ్చేందుకు క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. స్పోర్ట్స్ పాలసీ కోసం ఎవరు ఏ సలహాలు ఇచ్చినా స్వీకరిస్తామన్నారు. హైదరాబాద్‌లో గతంలో నిర్మించిన స్టేడియాలు ప్రైవేట్, రాజకీయ కార్యక్రమాలకే పరిమితమయ్యాయని తెలిపారు. వీటన్నింటినీ అప్ గ్రేడ్ చేసి విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వం ఆ బాధ్యత తీసుకోవాలనుకుంటుందని.. అందుకు అందరి మద్దతును కోరుతున్నామన్నారు. అన్ని రాజకీయ పక్షాలు ఒప్పుకుంటే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ మహిళ మంత్రి వీడియో మార్ఫింగ్... ఫిర్యాదు



హైదరాబాద్, ఆగస్టు 2: రాను రాను సమాజంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతోంది. యువతులపై లైంగిక వేధింపులే కాకుండా.. వారి ఫోటోలు, వీడియోలు మార్ఫింగ్ చేస్తూ దుర్మార్గానికి పాల్పడుతుంటారు కొందరు వ్యక్తులు. సామాన్య మహిళలే కాదు మంచి హోదా, పరపతి ఉన్న వారు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పుడు ఏకంగా తెలంగాణ రాష్ట్ర మహిళ మంత్రిని సైతం వదలలేదు ఆగంతకులు. మంత్రి సీతక్కకు సంబంధించిన వీడియోను కొందరు ఆగంతకులు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వైరల్ చేశారు. వీడియోని మార్ఫింగ్ చేసి సౌండ్స్ మార్చి ఎక్స్ ఖాతాలో సదరు ఆగంతకులు సర్క్యులేట్ చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు న్యాయవాది వెంకట నాయక్ ఫిర్యాదు చేశారు. అలానే మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కూడా మార్ఫింగ్‌పై కూడా ఫిర్యాదు చేశారు. రెండు వీడియోలను సర్కులేట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ వెంకట్ నాయక్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్వకేట్ వెంకట నాయక్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఐటీఏ - 2000-200, 79,33, (4),353(1) బీఎన్ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**అసెంబ్లీలో చర్చ :** మరోవైపు మంత్రి సీతక్క వీడియో మార్ఫింగ్ అంశం తెలంగాణ అసెంబ్లీలో చర్చకు వచ్చింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సభలో ఏదో వీడియో తీసుకుని ఇష్టారాజ్యంగా పోస్టు చేస్తున్నారని, పోలీసులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన మహిళా మంత్రిపై ఇలాంటి పోస్టులా అంటూ మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ... పార్లమెంట్, అసెంబ్లీలో ఫోటోలు తీయడం నేరమని.. దీనిపై కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు. సీతక్క మీద తప్పుడు ట్రోలింగ్ చేస్తే చర్యలు తీసుకోవద్దా... ప్రతిపక్ష సభ్యులు చర్యలు తీసుకోవద్దు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యలు చేశారు. చివరగా దీనిపై స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. ఫోటో మార్ఫింగ్‌పై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యే దానం వ్యాఖ్యలపై అసెంబ్లీలో కలకలం.. సభ నుంచి భారాస వాకౌట్



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. హైదరాబాద్ నగరంలో అభివృద్ధి కార్యక్రమాలపై సభలో స్వల్పకాలిక చర్చ జరిగింది. చర్చను ప్రారంభించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. భారాస సభ్యులనుద్దేశించి పరుష పదజాలం ఉపయోగించారని ఆ పార్టీ సభ్యులు నిరసనకు దిగారు. దానం వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన భారాస సభ్యులు పోడియంవైపు దూసుకొచ్చారు.

ప్రతిగా దానం కూడా పోడియంవైపు రావడంతో కాంగ్రెస్ సభ్యులు ఆయన్ను వెనక్కి తీసుకెళ్లారు. దానం నాగేందర్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్యే కేటీఆర్ భారాస సభ్యులతో కలిసి సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యల్లో అన్ పార్లమెంటరీ వ్యాఖ్యలు ఉంటే రికార్డుల నుంచి తొలగిస్తామని స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

# వయనాడ్‌లో 100 ఇళ్లు కట్టిస్తాం: రాహుల్ గాంధీ హామీ

కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడి భారీఎత్తున ప్రాణనష్టం సంభవించింది. ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాల్లో కాంగ్రెస్ అగ్రనేతలు వయనాడ్ మాజీ ఎంపీ రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ పర్యటిస్తున్నారు. ఈసందర్భంగా రాహుల్ ఒక హామీ ఇచ్చారు. తమ పార్టీ తరపున బాధితులకు 100కు పైగా ఇళ్లను కట్టి ఇస్తామని తెలిపారు. స్థానిక అధికారులతో సమావేశం అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఒకే ప్రాంతంలో ఇంతటి భయానక విషాదాన్ని మునుపెన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మిగతా వాటి మాదిరిగా కాకుండా దీనిని భిన్నంగా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతానని అన్నారు. అలాగే ఈ ఘటనను పార్లమెంట్‌లో లేవనెత్తుతామని చెప్పారు. ఈసందర్భంగా 100 ఇళ్ల హామీ ఇచ్చారు. ఆ ప్రాంతంలో జరిగిన ప్రాణ, ఆర్థిక నష్టం గురించి అధికారులు ఆయనకు వెల్లడించారు.

ఈ విషాదం జాతీయ విపత్తని రాహుల్ అభివర్ణించిన సంగతి తెలిసిందే. వెంటనే సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పునర్నిర్మాణం చేపట్టాలని కేంద్రాన్ని డిమాండు చేశారు. ఆయన తన సోదరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీతో కలిసి గురువారం కొండ చరియలు విరిగిపడిన చురాల్‌మలలో పర్యటించారు. వీరిద్దరూ తాత్కాలికంగా చెక్కతో ఏర్పాటుచేసిన వంతెనను దాటి బురద పేరుకుపోయిన ప్రాంతాల్లో వర్షంలోనే తిరిగారు. ఈ రోజు కూడా వయనాడ్‌లోని ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇదిలాఉంటే.. ఈ విలయంలో సర్వం కోల్పోయిన వారికి మానసికంగా భరోసా కల్పించేందుకు కేరళ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 121 మంది మానసిక నిపుణుల బృందాన్ని వయనాడ్ పంపినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు.




దిల్లీ: దేశ రాజధానిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఓ ఆశ్రమంలో చిన్నారుల అనుమానాస్పద మరణాలు చర్చనీయాంశమయ్యాయి. గడిచిన 20 రోజుల్లోనే 14 మంది ప్రాణాలు కోల్పోవడం కలవరపెడుతోంది. అందులో ఎక్కువ మంది మానసిక వికలాంగులే కావడం కలచివేస్తోంది. మొత్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 27 మంది చనిపోగా, మరణాలకు గల కారణాలు తెలియకపోవడం సంచలనంగా మారింది. దీనిపై వార్తలు రావడం, విపక్షాలు ఆందోళనలతో స్పందించిన 'ఆప్' ప్రభుత్వం పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. దేశ రాజధానిలో ఇటువంటి పరిణామం చోటుచేసుకోవడం షాక్‌కు గురిచేసిందని మంత్రి ఆతిశీ పేర్కొన్నారు. ఇటువంటి నిర్లక్ష్యాలను సహించేదిలేదని, పూర్తి స్థాయిలో దర్యాప్తు తర్వాత బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. 48గంటల్లోగా దీనిపై దర్యాప్తు జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖా శర్మ.. నిజనిర్ధరణ బృందాన్ని అక్కడికి పంపించినట్లు చెప్పారు. మరోవైపు ఈ ఘటనపై ఆందోళనకు దిగిన భాజపా.. ఆశ్రమం ముందు ధర్నా చేపట్టింది. ప్రాంగణంలోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించింది. తమకు ఉన్న సమాచారం ప్రకారం, పిల్లలకు మురికి నీరు అందుతోందని, ఆహారం, చికిత్స కూడా సరిగా ఇవ్వడం లేదని భాజపా నేతలు ఆరోపించారు. దీనికి బాధ్యులైన అధికారులందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. దిల్లీలోని రోహిణీ ప్రాంతంలో ఆశా కిరణ్ పేరుతో మానసిక వికలాంగుల ఆశ్రమం ఉంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఈ హోం సాంఘిక సంక్షేమ శాఖ కిందకు వస్తుంది. ఇటీవల ఆ విభాగాధిపతి రాజీనామా చేయడంతో అది ఖాళీగా మారింది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తిహాడ్ జైల్లో ఉండటంతో ఆ శాఖ బాధ్యతలను వేరే మంత్రికి అప్పగించలేకపోయారు.

# రేవంత్ రెడ్డికి హరీష్ రావు బహిరంగ లేఖ



హైదరాబాద్: పదోన్నతి పొందిన వేలాది మంది ఉద్యోగ ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అభినందనలు తెలిపారు. 10.468 పండిత, పీఈటీ పోస్టుల అప్ గ్రేడేషన్‌కు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్ని రకాల అనుమతులు ఇచ్చిందన్నారు. మీరు నిర్వహిస్తున్న సభలో సింహభాగం వారే కావడం గమనించాల్సిందిగా సూచిస్తున్నామన్నారు. మా ప్రభుత్వం 10.000 ప్రధానోపాధ్యాయ పోస్టులను మంజూరు చేస్తే ఇప్పటి వరకూ పాఠశాలలకు కేటాయించలేదన్నారు. వెంటనే కేటాయించి ఎస్‌జీటీలకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ రోజు వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ముఖాముఖిలో మీరు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మీరు ఇచ్చిన మాట ప్రకారం మరింత మెరుగైన పీఆర్‌ఈసీ ఎప్పుడు అమలుచేస్తారో విస్పష్టంగా ప్రకటింలని హరీష్ రావు డిమాండ్ చేశారు. మీరు మీ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కనీసం పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను ఎప్పుడు అనుమతిస్తారో ఆ సంగతన్నా సభలో ప్రకటిస్తే అందరూ సంతోషిస్తారన్నారు. న్యూ పెన్షన్ స్కీం స్థానంలో ఓల్డ్ పెన్షన్ స్కీం తీసుకువస్తామన్నారు. ఎప్పటి నుంచి అమలుచేస్తారో సభలో ప్రకటించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నామన్నారు. పాఠశాలలకు స్కావెంజర్స్‌ను అనుమతిస్తామన్నారు. అది ఇప్పటివరకూ కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామన్నారు. ఇప్పటికీ దానిపై నిర్ణయం ప్రకటించలేదని హరీష్ రావు అన్నారు. బదిలీ అయినా ఇప్పటి వరకూ రాష్ట్రంలో నూతన పాఠశాలలో చేరని ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని హరీష్ రావు అన్నారు. బదిలీల వలన ఖాళీలు ఏర్పడిన పాఠశాలలో అవసరమైన మేరకు విద్యావాలంటీర్లను వెనువెంటనే నియమించాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని హరీష్ రావు అన్నారు. మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు మీరు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే వేతనాలు పెంచాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డితో గద్వాల ఎమ్మెల్యే భేటీ




హైదరాబాద్: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. గత నెలలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమావేశం కావడంతో తిరిగి ఆ పార్టీలో చేరతారా అనే సందేహాలు వచ్చాయి. ఆ వెంటనే మంత్రి జూపల్లి కృష్ణారావు రంగంలోకి దిగారు. బండ్లతో చర్చలు జరిపి, సీఎం రేవంత్ రెడ్డి వద్దకు తీసుకొచ్చారు.

**తీసుకొచ్చిన మంత్రి జూపల్లి :** సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి బండ్ల కృష్ణ మోహన్ రెడ్డిని మంత్రి జూపల్లి కృష్ణారావు తీసుకొచ్చారు. సీఎంతో భేటీ తర్వాత బండ్ల భవిష్యత్ కార్యాచరణ తెలియనుంది. బండ్లకు నామినేటెడ్ పదవి, లేదంటే నియోజకవర్గానికి నిధులపై హామీ ఇస్తారని తెలుస్తోంది.

**అభివృద్ధి కోసం నిధులు..!! :** గద్వాల నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. నిన్న బండ్లను కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడారు. గద్వాల రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఏదైనా పొరపాటు జరిగితే సరిదిద్దుతామని మంత్రి జూపల్లి.. బండ్లకు హామీనిచ్చారు. జూపల్లి భరోసా ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని బండ్ల నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

కేటీఆర్, ఇతర నేతలతో బండ్ల కృష్ణ మోహన్ రెడ్డికి మంచి అనుబంధం ఉందని జూపల్లి కృష్ణారావు వివరించారు. ఆ క్రమంలోనే ఇటీవల వెళ్లి కలిశారని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్‌లో చేరిక..** బీఆర్ఎస్ పార్టీని వీడి జూలై 6వ తేదీన బండ్ల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల కేటీఆర్‌ను కలువడంతో రాజకీయంగా దుమారం చెలరేగింది.

దాంతో కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగింది. బండ్లతో చర్చలు జరిపి, పార్టీలో కొనసాగాలని కోరినట్టు సమాచారం.


# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కాకుండా మరోచోట హైకోర్టు భవనం కట్టండి : కేటీఆర్

హైదరాబాద్ : రాష్ట్రానికి సంబంధించి హైకోర్టు భవనం ఆధునికంగా కడుతామన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.. కానీ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వ విద్యాలయంలో కాకుండా మరో చోట కట్టాలని కోరుతున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. శాసనసభలో సివిల్ కోర్టుల సవరణ బిల్లును శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వ్యవసాయ భూముల్లో హైకోర్టు భవనం నిర్మించొద్దని యూనివర్సిటీ విద్యార్థులు నెల రోజుల పాటు ఆందోళన చేశారు. వ్యవసాయ విద్యాలయంలో పరిశోధనలతో ఫీల్డ్ ఎక్సపరిమెంట్ పరిశోధనలు జరగాలి. ఆ పరిశోధనలకు భూమి అవసరం. రాష్ట్ర రైతంగానికి ఉపయోగపడే విధంగా కొత్త వంగడాలు తీసుకురావాలి. కాబట్టి వ్యవసాయ పరిశోధనలు జరగాల్సిన యూనివర్సిటి భూములను తీసుకోవద్దని కోరుతున్నా. అగ్రికల్చర్ వర్సిటీకి చెందిన 100 ఎకరాలు తీసుకుంటామన్న ఆలోచన విరమించుకోవాలి. అక్కడ ప్రొఫెసర్లు, విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. మరో ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.

**ప్రతిపక్షాలు నిరసనలు చేయడం పరిపాటి..** కేంద్ర చట్టాల విషయంలో కర్ణాటక, పశ్చిమ బెంగాల్, తమిళనాడు సీఎంలు ముగ్గురు కూడా తమ తమ రాష్ట్రాల్లో సవరణలు తీసుకోస్తామన్నారు. ఈ చట్టాల ప్రకారం ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేయడం కూడా నేరం. గతంలో మీ పార్టీ వారు చాలా సార్లు చేశారు. కాబట్టి ఇబ్బందులు జరుగుతాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల తరపున ప్రతిపక్షాలు నిరసనలు చేయడం పరిపాటి. కాబట్టి మీరు సవరణలు తీసుకోస్తారో లేదో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు.

**చట్టాలను దుర్వినియోగం చేసే పరిస్థితి రాకూడదు..** సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘం వారు సభ పెట్టుకుంటామంటే పోలీసులు అనుమతి ఇవ్వడం లేదు. ఏ చట్టం ఉపయోగించి నిరాకరించరో తెలియడం లేదు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే డిలీట్ చేయమని ఒత్తిళ్లు వస్తున్నాయి. అనధికారిక ఒత్తిడి, బలప్రయోగం చేయడం సరికాదు. దీన్ని కూడా ప్రభుత్వం ఆలోచించాలి. చట్టాలను దుర్వినియోగం చేసే పరిస్థితి రాకూడదన్నారు కేటీఆర్.

# భారీ గణపతి మట్టి పనులు ప్రారంభం..



హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక ఖైరతాబాద్ గణపతి విగ్రహం తయారీలో కీలక దశగా భావించే మట్టి పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి గణపతి రెండు పాదాల నుంచి మట్టి పనులను ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌తో పాటు బీఆర్ఎస్ నేత బిల్డర్ రమేష్, టీపీసీసీ నేత మధుకర్‌యాదవ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మట్టి పనులతో రెండు రోజుల్లో ఖైరతాబాద్ గణపతికి ఒక రూపం రానుంది. ఇప్పటికే వెల్డింగ్ పనులు పూర్తి కాగా గురువారం సాయంత్రం వరకు స్టీలు వెల్డింగ్ పైనుంచి సన్నటి మెష్ వేసే పనులు పూర్తి చేసి మట్టిపనులను ప్రారంభించారు. శ్రీ పంచముఖ మహాశక్తి గణపతి విగ్రహనమూనాను ఆవిష్కరిస్తామని ఉత్సవ కమిటీ ప్రకటించినా, అనివార్య కారణాల వల్ల నమూనా విడుదలను శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు వాయిదా వేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్(%ఖష్ఠ్రుఱఅతీఖ్యుఎఝఎ మీూా ఋఖుఅఖ చీఖ్రస్త్రవఅఎవతీ%), ఇతర ప్రముఖులు నమూనాను ఆవిష్కరించనున్నట్లు కమిటీ ప్రతినిధులు సందీపరాజ్, రాజ్‌కుమార్, మహేష్ యాదవ్, వీణామాధురి, బాల్‌కుమార్ తదితరులు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com